సత్యం, సమర్థత, విశ్వసనీయత

WWW.SAKSHYAM.COM

# సాక్ష్యం

తెలుగు దినపత్రిక


సంపుటి: 17 | సంచిక: 159
పేజీలు: 08 | వెల: రూ.2:00

విజయవాడ | సోమవారం 08 జూన్ 2026

Published from Vijayawada, Hyderabad.

## తెలుగు రాష్ట్రాలను తాకిన నైరుతి రుతుపవనాలు..

### రాగల మూడు రోజుల్లో భారీ వర్షాలు..!



ఓవైపు ఎండలు, మరోవైపు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ అత్యంత చల్లని కబురు అందించింది. నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా శరవేగంగా విస్తరిస్తూ ముంగిట్లోకి వచ్చేశాయి. పశ్చిమ-మధ్య, ఈశాన్య బంగాళాఖాతం అంతటా ఇవి పూర్తిగా ప్రవేశించడంతో, రాబోయే రెండు మూడు రోజుల్లోనే రెండు రాష్ట్రాల్లోనూ విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. దేశవ్యాప్తంగా వాతావరణంలో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అనుకూల పరిస్థితుల వల్ల నైరుతి రుతుపవనాలు వేగంగా ముందుకు సాగుతున్నాయి. ఇప్పటికే మిగతా 3 లో..



## నేడు ఢిల్లీలో సమావేశం కానున్న విపక్ష ఇండియా కూటమి

### హాజరు కానున్న 23 రాజకీయ పార్టీలు
### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వెల్లడి

విపక్ష ఇండియా కూటమి నేడు ఢిల్లీలో సమావేశం కానుంది. కేంద్ర విధానాలపై ప్రజా పోరాటాలు చేయాలన్న ఎజెండాతో ఇండి కూటమి భేటీ జరగనుంది. మిగతా 2 లో..



## నేటి నుంచి చేప ప్రసాదం పంపిణీ

### నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ప్రారంభం

మృగశిర కార్తె సందర్భంగా హైదరాబాద్‌లో చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సోమవారం రాత్రి 9 గంటలకు చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం కానుంది. మంగళవారం సైతం చేప ప్రసాదం పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు మిగతా 2 లో..



## జూన్ 15న స్కూల్స్ రీఓపెనింగ్

తెలంగాణలో పాఠశాలల రీఓపెన్‌పై విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. 2026-27 విద్యా సంవత్సరానికి గానూ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ముందుగా నిర్ణయించిన తేదీని మారుస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు జూన్ 12న కాకుండా జూన్ 15వ తేదీన పునఃప్రారంభం కానున్నాయి. ఈ మిగతా 2 లో..

### స్థానిక సంస్థల
# ఎన్నికలకు సిద్ధం

### కుప్పంలో కీలక మార్పులు.. కంచర్ల శ్రీకాంత్ తొలగింపు

### స్వయంగా తానే చూసుకుంటానని ప్రకటించిన సీఎం

### పార్టీ శ్రేణులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం





సీఎం చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గమైన చిత్తూరు జిల్లా కుప్పంలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జిగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇకపై కుప్పం నియోజకవర్గ వ్యవహారాలన్నీ తానే స్వయంగా చూసుకుంటానని పార్టీ నేతలకు స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో నియోజకవర్గ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు మొదలయ్యాయి. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కుప్పం నియోజకవర్గ టీడీపీ నేతలతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కంచర్ల శ్రీకాంత్ అంశం చర్చకు వచ్చింది. వాస్తవానికి ఇంఛార్జి బాధ్యతల నుంచి తనను తప్పించాలని శ్రీకాంత్ గత కొంతకాలంగా అధిష్ఠానాన్ని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న చంద్రబాబు.. ఆయన్ను బాధ్యతల నుంచి తప్పిస్తూ నిర్ణయం ప్రకటించారు. కంచర్ల శ్రీకాంత్ సేవలను రాష్ట్రస్థాయిలో వినియోగించుకోవాలని భావిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే తాను కుప్పంలో పర్యటిస్తానని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. కాగా, కంచర్ల శ్రీకాంత్ స్థానంలో అనంతపురం జిల్లాకు చెందిన మరో శ్రీకాంత్‌కు కుప్పం నియోజకవర్గ సమన్వయ బాధ్యతలు అప్పగించినట్లు ప్రచారం జరుగుతోంది. ఆయన మార్గదర్శకత్వంలో పనిచేయాలని స్థానిక నేతలకు చంద్రబాబు సూచించినట్లు సమాచారం. మరోవైపు, కంచర్ల శ్రీకాంత్‌ను చంద్రబాబు తన వ్యక్తిగత సహాయకుడిగా (పీఏ) నియమించుకున్నారనే వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అయితే ఈ నియామకాలపై పార్టీ నుంచి అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. 2023లో జరిగిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కంచర్ల శ్రీకాంత్ అనూహ్య విజయం సాధించి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందారు. అనంతరం శాసనమండలిలో విప్‌గా, కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా) పొలిటికల్ ఛైర్మన్‌గా కూడా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. పార్టీ ప్రక్షాళనలో భాగంగా, అలాగే ఆయన సేవలను విస్తృత స్థాయిలో వాడుకోవాలనే ఉద్దేశంతోనే ఈ మార్పు జరిగినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## తొలి ట్రిలియనీర్‌గా నిలిచేందుకు అడుగు దూరం

### ఎలాన్ మస్క్ దెబ్బకు రికార్డులన్నీ బ్రేక్!

టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ప్రపంచ ఆర్థిక చరిత్రలోనే ఒక అపూర్వమైన మైలురాయిని అందుకోవడానికి చేరువలో ఉన్నారు. ప్రస్తుత అంచనాలు నిజమైతే, ఆయన ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా నిలిచే అవకాశం ఉంది. ఒక ట్రిలియన్ డాలర్ల సంపదను కలిగిన మొట్టమొదటి వ్యక్తిగా మస్క్ రికార్డు సృష్టించబోతున్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా ఉన్న మస్క్ సంపదలో అధిక భాగం టెస్లా కంపెనీ షేర్ల రూపంలో ఉంది. మిగతా 3 లో..



# మెట్రో విస్తరణకు అడ్డుపుల్ల

- మూసీ ప్రక్షాళనపై రాజకీయాలు ఎందుకు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారు
- మూసీ ప్రక్షాళనకు ఉద్దేశపూర్వకంగా అడ్డు
- కేంద్రం నుండి అనుమతులు ఎందుకు రాలేదు
- కిషన్ రెడ్డి కేటీఆర్‌కు సహకరిస్తున్నారు
- గంగా నదిని అక్కడ ప్రక్షాళన చేస్తున్నారు
- సమాధానం చెప్పాలని కిషన్ రెడ్డిని డిమాండ్
- కిషన్ రెడ్డి సంగతి జూన్ 15 తర్వాత తేలుస్తా..
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు
- పలు అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన

"గుజరాత్‌లో సబర్మతి రివర్‌ఫ్రంట్, ఢిల్లీలో యమునా రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేసుకున్నారు. యూపీలో గంగానది ప్రక్షాళన చేశామని యోగి చెప్పుకున్నారు. మా మోదీ నదులను ప్రక్షాళన చేశారని బీజేపీ నేతలు గొప్పగా చెప్పుకుంటున్నారు. మూసీ ప్రక్షాళనను మాత్రం వ్యతిరేకిస్తున్నారు. ఉప్పల్, నల్గొండ ప్రజలు మూసీ మురికితో ఇబ్బందులు పడుతున్నారు. రెండో స్థానంలోని హైదరాబాద్ మెట్రో 9వ స్థానానికి పడిపోయింది. మెట్రో విస్తరణకు ప్రతిపాదనలు పంపితే కేంద్రం ఆమోదించట్లేదు. నాగోల్ నుంచి నేరుగా ఎయిర్‌పోర్టుకు వెళ్లేలా మెట్రో విస్తరణకు ప్రతిపాదనలు పంపాం. కేంద్రమంత్రిగా ఉన్న నేత మెట్రో విస్తరణను ఢిల్లీలో అడ్డుకుంటున్నారు. మెట్రో విస్తరణను అడ్డుకుంటున్న నేతలను నిలదీయాలి. మెట్రోకు ఎందుకు అనుమతులు రావట్లేదో కిషన్‌రెడ్డి చెప్పాలి"- రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

ఓ కేంద్రమంత్రి హైదరాబాద్ మెట్రో విస్తరణను ఢిల్లీలో అడ్డుకుంటున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ మెట్రో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం ఆమోదించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బీజేపీలో ఉంటూనే బీఆర్ఎస్ నేత కేటీఆర్‌కు సహకరిస్తున్నారని స్వయంగా ఆ పార్టీ నేతలు చెబుతున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం నుండి అనుమతులు ఎందుకు రావడం లేదో సమాధానం చెప్పాలని కిషన్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఉప్పల్ భగాయత్ వేదికగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు సాంకేతిక సేవలను ప్రారంభించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణం, ఉప్పల్‌లో వంద పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణం, ఏవోసీ సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన పునాది వేశారు. భవిష్యత్తు డిజిటల్ సేవల కోసం క్యూర్-1 మిగతా 2 లో..



### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో రూ.1,511 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

హైదరాబాద్ మహానగరాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో రూ.1,511 కోట్ల విలువైన భారీ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో జరిగిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజ నర్సింహ సహా ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజల సౌకర్యార్థం కామన్ యూనిఫైడ్ బిల్లింగ్ అండ్ కలెక్షన్ సిస్టమ్ 'క్యూర్-1' యాప్‌ను కూడా సీఎం ఈ సందర్భంగా ప్రారంభించారు. మల్కాజిగిరి మిగతా 2 లో..

# మీ తాటాకు చప్పుళ్లకు భయపడను

### నేనేంటో తెలంగాణ ప్రజలకు తెలుసు
### 12 పార్టీలు తిరిగి ఈ పార్టీలో చేరలె..
### నేను పుట్టింది బీజేపీలోనే.. చనిపోయేదీ ఈ పార్టీలోనే
### కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు



నన్ను ఆపగలిగే వ్యక్తి ఇంకా తెలంగాణ గడ్డపై పుట్టలేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఏ అంశంపై ఎక్కడ చర్చ పెట్టినా పాల్గొనడానికి తాను సిద్ధమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులకు కేంద్రం సహకరించకపోతే కిషన్‌రెడ్డి పొలిమేర దాటబోరంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆయన సీఎం రేవంత్ రెడ్డిపై ధ్వజమెత్తారు. 'మీరు ఎంత రెచ్చగొట్టినా రెచ్చిపోయే వ్యక్తిని కాను. మీ తాటాకు చప్పుళ్లకు భయపడే కేసీఆర్‌ను నేను కాదు. నేనేంటో తెలంగాణ ప్రజలకు తెలుసు. 12 పార్టీలు తిరిగి ఈ పార్టీలో చేరలె.. నేను పుట్టింది బీజేపీలోనే.. చనిపోయేదీ ఈ పార్టీలోనే.. ' అంటూ మిగతా 2 లో..


## టీవీకే ప్రభుత్వం కనీసం మూడు నెలలైనా నిలబడుతుందా?

### విజయ్ ప్రభుత్వంపై డీఎంకే నేత స్టాలిన్ తీవ్ర విమర్శలు

మిళనాడులోని టీవీకే ప్రభుత్వంపై డీఎంకే నేత స్టాలిన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. నూతనంగా కొలువుదీరిన టీవీకే ప్రభుత్వం కనీసం మూడు నెలలైనా నిలబడుతుందా? అని ప్రశ్నించారు. ప్రస్తుత టీవీకే ప్రభుత్వం తీరుతెన్నుల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని అన్నారు. అయితే, టీవీకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు 6 నెలల పాటు విమర్శలకు దూరంగా ఉండాలని అనుకున్నామని, కానీ, రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. టీవీకే ప్రభుత్వం అస్పష్టమైన స్థితిలో నడుస్తోందని పేర్కొన్నారు. చెన్నైలో వీసీకే మాజీ ఎమ్మెల్యే పనైయూర్ బాబు, ఆయన మద్దతుదారులు స్టాలిన్ సమక్షంలో డీఎంకేలో మిగతా 3 లో..

# తెలంగాణకు శాపమే..

- తెలంగాణ జలాలను రేవంత్ రెడ్డి తాకట్టు పెడుతున్నారు
- గురువు చంద్రబాబు కోసం రేవంత్ తాపత్రయం
- తెలంగాణ నీటి హక్కులు కాలరాస్తుంటే ఊరుకోం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు



ఏపీ తెలంగాణ మధ్య నదీ జలాల విషయం మరోసారి తీవ్ర వివాదానికి దారి తీసింది. తెలంగాణ సర్కార్ తీరు, సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై.. ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. తన గురువు చంద్రబాబు కోసం.. తెలంగాణ జలాలను రేవంత్ రెడ్డి తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ నీటి హక్కులు కాలరాస్తుంటే.. బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. నదీ జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కళ్లల్లో ఆనందం చూడడం కోసమే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తెలంగాణ నదీ జలాలపై హక్కులను తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. గోదావరి - కావేరీ నదుల అనుసంధానం పేరుతో తెలంగాణ జలాలను ఏపీకి తరలించుకుపోయే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. తెలంగాణ భూభాగాన్ని టచ్ చేయకుండా నదుల అనుసంధానం చేస్తున్నారని.. ఇలా జరిగితే తెలంగాణకు ఒక్క చుక్క నీరు రాదని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణ మధ్య ఇన్ని సమావేశాలు జరిగితే వాటి మినిట్స్ ఎందుకు బయటపెట్టట్లేదని మిగతా 2 లో..

# సంపాదకీయం

## ఉనికి కోసం నానా యాగీ

తెలంగాణను ముంచిన వారంతా ఇప్పుడు వీరతాళ్లు వేసుకుని..నా తెలంగాణ అంటూ ఊరేగుతున్నారు. విగ్రహాల పేరుతో కొందరు నిగ్రహం కోల్పోయి మాట్లాడుతున్నారు. తెలంగాణ అస్తిత్వం ప్రమాదంలో పడ్డదని వాపోతున్నారు. ఇప్పుడు తెలంగాణ సెంటిమెంట్ కోసం మళ్లీ రాజకీయ రగడ మొదలయ్యింది. ఎవరికి వారు తామే తెలంగాణ భావి విధాతలమని మాట్లాడుతున్నారు. పవన్ కళ్యాణ్‌ను బూచిగా చూపి ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతున్నారు. నిజానికి తెలంగాణ ఏర్పడ్డ తరవాత జరిగిన ద్రోహం, అంతకుముందు ఎప్పుడూ జరగలేదు. ఉమ్మడి ఏపిలో జరగనంత దోపిడీ గత 12 ఏళ్లుగా సాగుతోంది. ఎక్కడికక్కడ భూములు దోచుకున్నారు. అప్పుల లేని తెలంగాణను అప్పుల కుప్పచేసి అనుభవిస్తున్నారు. ఎవరికి వారు తామే తెలంగాణను ఉద్ధరించామని చెప్పుకుంటున్నారు. నిరుద్యోగ సమస్య తీరలేదు. నీటి సమస్యలు తీరలేదు. నిధులు పారించలేదు. అంతెందుకు రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరలకు కొని సేకరణ సక్రమంగా చేయడంలో కూడా విఫలం అయ్యారు. మక్క, జొన్న, మిర్చి, పత్తి రైతులు ఏటా పడుతున్న కష్టాలను పట్టించుకోని అసమర్థులుగా మిగిలి పోయారు. ఇకపోతే తెలంగాణలో కొత్తగా అప్పులు సృష్టించలేదు. అయినా పాలకులుగా పనిచేసిన వారు తామే తెలంగాణను ఉద్ధరించామని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ప్రజలకు పెన్షన్లు, ఇళ్లు, ఆరోగ్యశ్రీలు ఎరగా వేసి దర్జాగా దోచేస్తున్నారు. నిజానికి ఉమ్మడి ఏపి నుంచి తెలంగాణ విడివడ్డాక తెలంగాణ అభివృద్ధి చెందిందా..లేక అప్పుల పాలయ్యిందా అంటే..అప్పుల పాలయ్యిందని లెక్కలు చెబుతున్నాయి. సమయానికి జీతాలు ఇవ్వలేని వారు పాలకులు అయ్యారు. హైదరాబాద్ మా అయ్య జాగీరా అని జనసేనాని పవన్ కళ్యాణ్ అనగానే కొందరు ఒంటి కాలిపై లేచి..అవును మా అయ్య జాగీరే అంటున్నారు. ఎందుకంటే మూడో వ్యక్తి వస్తే..దోచుకోవడానికి అవకాశం ఉండదు కనుక...ఎగిరెగిరి పడుతున్నారు. తెలంగాణ సమాజాన్ని బెదిరిస్తున్నారంటూ పవన్‌ను ఛీప్పి చెండాడేందుకు వెన వేశారు. పవన్ మీడియా సమావేశంలో మాట్లాడిన మాటలు నిజంగానే తెలంగాణలోని కొందరికి బాధ కలిగించాయి. అందులో అనుమానం లేదు. రాజకీయంగా తెలంగాణలో ఉన్న కొందరు జనసేనలోనూ ఉన్నారు. వారికి పదవులు రావాలంటే జనసేన పక్షాన పోటీ చేయాల్సిందే. రాజకీయ పార్టీ అన్న తరవాత పోటీకి సై అంటుంది. జనసేన కూడా అదే చేసింది. అయితే మిగతా ప్రాంతాలకు, తెలంగాణకు ఓ రేఖ అడ్డంగా ఉంది. అదే సెంటిమెంట్. తెలంగాణ ప్రజలను ముంచిందే సెంటిమెంట్. ఆ సెంటిమెంట్‌తోనే ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డది. అది అడ్డం పెట్టుకునే కెసిఆర్ కుటుంబం పదేళ్ల దర్జాగా తెలంగాణలో పాగా వేసి, ఇష్టారాజ్యంగా దోచుకున్నది. పదవులు, డబ్బులు, భూములు దోచేసారు. లక్షల కోట్లు తెలంగాణ నెత్తిన అప్పులు పెట్టారు. తరవాత గత రెండేళ్లుగా కాంగ్రెస్ కూడా అదే దారిలో నడుస్తోంది. అభివృద్ది పేరిట ఊదరగొట్టిన కాంగ్రెస్ నేతలు పప్పు బెల్లాల తెలంగాణను పంచుకుంటున్నారు. భూములు యథేచ్ఛగా అమ్మేస్తున్నారు. ఈ క్రమంలో పవన్ రాకతో మరోమారు సెటిమెంట్ రగిల్చి బూచిపడాలన్న ధోరణిలో పొన్నం ప్రభాకర్, కెటిఆర్, కవితలు తామే అసలుసిసలు తెలంగాణ వారసులమని చెప్పుకునే ప్రయత్నంలో పడ్డారు. తెలంగాణ సమాజం అస్తిత్వ సంక్షోభం పడుతున్నదని గొంతు చించుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి ఆంధ్రా ఆధిపత్యం కిందకు వెళుతోందని ప్రకటించుకున్నారు. పవన్ కళ్యాణ్ ఎంట్రీ వెనక బిజెపి, మోదీ ఉన్నారని ఆరోపిస్తున్నారు. తెలంగాణ కూడా భారతదేశంలోనే ఉందని, అందుకు బిజెపి ఎక్కడైనా పావులు కదుపుతుందని తెలుసుకోవాలి. బిజెపికి తెలంగాణ కూడా ఒక రాష్ట్రమని తెలుసు. ఇక్కడ పాగా వేయాలని ఎప్పటినుంచో కలలు కంటోంది. కనుక దాని ప్రయత్నాల్లో అది ఉంది. ఇది రాజకీయం. కెసిఆర్ కూడా భారత రాష్ట్ర సమితి అంటూ దేశాన్ని ఏలుతానని అన్ని రాష్ట్రాలు తిరిగారు. దానిని ఎవరైనా తప్పుపట్టరా అన్న కెటిఆర్ చెప్పాలి. రాజకీయ పార్టీ పెట్టి ఇక్కడ వైఎస్ షర్మిల కూడా పాదయాత్ర చేశారు. తాను తెలంగాణ బిడ్డనని ప్రకటించుకున్నారు. అప్పుడు లేని రోషం ఇప్పుడే ఎందుకు వచ్చిందన్నది ప్రశ్న. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం స్వరాష్ట్రంలో ఆంధ్రా వలసవాదం పెరిగింది. దానికి కెసిఆర్ ఆద్యులు. ఆయనే మాకు ఆంధ్రతో పేచీ లేదంటూ..జగన్‌ను పిలిచి భోజనం పెట్టి అలయ్ బలయ్ చేసుకున్నారు. కృష్ణా నీటిని ఎపికి దోచి పెట్టారని వస్తున్న ఆరోపణలకు కెసిఆర్ బృందం నుంచి సమాధానం లేదు. తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకుని, హైదరాబాద్ సంపదను కొల్లగొట్టడానికి వస్తున్నారని జనసేనాని పవన్ కళ్యాణ్‌పై విమర్శించారు. ముందు..ఇక్కడ ఎంత కొల్లగొట్టారో చెప్పాలి. ధరణి పేరుతో మోసాలు. కాళేశ్వరం పేరుతో దగా. టెలిఫోన్ ట్యాపింగ్. అస్మదీయులకు రాజ్యసభ పదవులు.. ఇలా చెప్పుకుంటూ పోతే కథలు కోకొల్లలు. ఇప్పుడు రెండేళ్ల పాలనలో మంత్రులందరిపైనా అవినీతి గుప్పు మంటోంది. అయినా ఎవ్వరు కూడా మాట్లాడడం లేదు. తెలంగాణ మేధావులు నోరు మెదపడం లేదు. కాంగ్రెస్ వచ్చాకనే స్వేచ్ఛ వచ్చిందని కోదండరామ్ సార్ అంటున్నారు. అంటే కెసిఆర్ ఉన్నంతకాలం నిరంకుశ పాలనలో మగ్గామనే అర్థం కదా. తెలంగాణ అస్తిత్వం మీద దాడిలో, మోదీ, చంద్రబాబుల ఉమ్మడి ప్రణాళిక దాగి ఉందని ఘోషిస్తున్న వారు, ఏ రకమైన దాడి జరిగిందో చెప్పాలి. ఈ గడ్డపై నివసిస్తున్న ఇక్కడే మమేకమైన వారంతా తెలంగాణ బిడ్డలే. వాళ్ల పిల్లల భవిష్యత్తు, వారి ఉద్యోగాలు, వ్యాపారాలు అన్నీ ఈ తెలంగాణ రాష్ట్రంతోనే ముడిపడి ఉన్నాయి. రాజకీయ పార్టీలు అన్ని చోట్ల తమ అస్తిత్వం కోసం ప్రయత్నం చేస్తుంటాయి. కెసిఆర్ కుటుంబానికి చెందిన పార్టీలే తెలంగాణకు ప్రతినిధులు కారు. తెలంగాణ కోసం కష్టపడే వారు ఎవరైనా రాజకీయాలు చేసుకునే హక్కు ఉంటుంది. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగే సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి పోటీ చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనిని తప్పుపట్టడానికి లేదు. ఉమ్మడి రాష్ట్రంలో అధికారం చలాయించిన సమైక్య పాలకులు, తెలంగాణ ఏర్పాటుతో అధికారం చేజిక్కిన వారు కూడా తెలంగాణను నిలువునా దోచుకున్నారు. కాబట్టి ఎవ్వరు కూడా తెలంగాణ అస్తిత్వం కోసం పోరాడలేదు. తమ స్వార్థ రాజకీయం కోసమే పోరాడారు. ఇంకా పోరాడుతున్నారు. ఇప్పుడు రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా ఇదే సెంటిమెంటుతో తమ ఉనికి కోసం కొందరు ఇప్పుడు నానా యాగీ చేస్తున్నారని గుర్తిస్తే మంచిది.

## తెలంగాణకు శాపమే..

మొదటిపేజీ తరువాయి..

హరీష్ రావు ప్రశ్నించారు. ఈ రహస్య మీటింగ్‌లకు తెలంగాణ తరఫున చంద్రబాబు సమ్మతితో, గతంలో తెలంగాణ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పనిచేసిన ఆదిత్యనాథ్ దాస్ వెళ్తున్నారని.. అసలేం జరుగుతుందో తెలంగాణ ఇంజనీర్లకే తెలియడం లేదని ఆరోపించారు. దీని వెనుక స్పష్టమైన కుట్ర ఉందని హరీష్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబుకు తొత్తుగా మారి రేవంత్ రెడ్డి తెలంగాణ నదీ జలాల హక్కులను ఏపీకి తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక తిట్లపురాణం అందుకున్నారని దుయ్యబట్టారు. తమను ఎన్ని తిట్టినా భరిస్తాము.. కానీ తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే ప్రశ్నించడం మాత్రం ఆపేది లేదని హరీష్ రావు తేల్చి చెప్పారు.

గతంలో కృష్ణా నీటిని.. ఇప్పుడు గోదావరి నీటిని మళ్లించేందుకు తెలంగాణను మోసం చేస్తున్నారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానం పేరుతో ఏపీ ప్రభుత్వం నీటిని తరలించేందుకు మరోసారి ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. గోదావరి నదిలో సర్‌ప్లస్ వాటర్ లేదని.. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే చెప్పిందని.. ఆ మాటనే బీఆర్‌ఎస్ బయటపెట్టిందని తెలిపారు. సమ్మక్కసాగర్, నాగార్జునసాగర్.. సోమశిల నుంచి కావేరి నది గత ప్రతిపాదన అని పేర్కొన్న హరీష్ రావు.. తెలంగాణ భూభాగంలో నుంచి వెళ్లకుండా ఏపీ సర్కార్ నదుల అనుసంధానం చేస్తోందని పేర్కొన్నారు. పోలవరం నుంచి నల్లమల సాగర్.. అక్కడి నుంచి సోమశిల నది అనుసంధానం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసిందని హరీష్ రావు గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నీటిని మళ్లించేందుకు ఏపీ సర్కార్ ప్రయత్నిస్తోంది.. ఒకవేళ అదే జరిగితే.. తెలంగాణకు ఒక్క చుక్క నీరు కూడా రాదని.. జాతీయ ప్రాజెక్ట్ రావాలని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి-బనకచర్లను మొదట బయటపెట్టిందే బీఆర్‌ఎస్ పార్టీయేనని.. దానిపై ప్రశ్నించింది కూడా తమ పార్టీనే అని హరీష్ రావు తేల్చి చెప్పారు.

## నేటి నుంచి చేప ప్రసాదం పంపిణీ

మొదటిపేజీ తరువాయి..

అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గత ఏడాది జరిగిన కొన్ని అవాంఛనీయ సంఘటనలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. రద్దీని నియంత్రించేందుకు, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు ఈసారి ప్రత్యేకంగా 35 కౌంటర్లను అందుబాటులోకి తెచ్చారు. ఒకవేళ పంపిణీ సమయంలో వర్షం పడినా ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రత్యేకంగా షెడ్ల పరిధిలోనే ప్రసాదం పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమం కోసం మత్స్యశాఖ ఆధ్వర్యంలో సుమారు 1.4 లక్షల చేప పిల్లలను సిద్ధంగా ఉంచినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. చిన్నపిల్లలకు ఇచ్చే చిన్న చేపను రూ. 40 చొప్పున, పెద్ద చేపలను రూ. 50 చొప్పున విక్రయించనున్నారు. మొత్తం 1.5 లక్షల మంది భక్తులకు సరిపోయేలా దాదాపు 5 క్వింటాళ్ల ప్రసాదాన్ని తయారు చేసినట్లు బత్తిని కుటుంబసభ్యులు తెలిపారు. దాదాపు 180 ఏళ్ల నుంచి బత్తిని కుటుంబం ఉబ్బసం సమస్య ఉన్న వారి కోసం చేప మందు పంపిణీ చేస్తోంది. కొన్నాళ్లకు ఇది చేప ప్రసాదంగా మారింది. వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం నాంపల్లి గాంధీభవన్ వెనుక ఉన్న వేర్ హౌసింగ్ గోదాముల గేటు వద్ద 1 నుండి 6వ నంబరు వరకు ప్రత్యేక కౌంటర్లను కేటాయించారు. భక్తుల రవాణా సౌకర్యం కోసం జేబీఎస్, ఎంజీబీఎస్, కాచిగూడ తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ ఉచిత బస్సులను నడుపుతోంది. జీహెచ్ఎంసీ, జలమండలి, పోలీస్, ట్రాఫిక్ సహా మొత్తం 14 ప్రభుత్వ శాఖలు ఈ చేప ప్రసాదం పంపిణీ ఏర్పాట్లలో భాగస్వాములు అయ్యాయి. చేప ప్రసాదం పంపిణీపై బత్తిని అనిరుధ్‌గౌడ్ మాట్లాడుతూ.. సోమవారం రాత్రి మొదలయ్యే చేప ప్రసాదం పంణిణీ ఈ నెల 9వ తేదీ రాత్రి వరకు కొనసాగుతుందని తెలిపారు. ఆ తర్వాత దూద్‌బౌలిలోని తమ నివాసంలో మరో 3 రోజుల పాటు ప్రసాదాన్ని అందజేస్తామని తెలిపారు. ప్రసాదం కోసం వచ్చే చివరి వ్యక్తి వరకు పంపిణీ జరిగేలా బత్తిని సోదరులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారని ఫిషరీస్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ వివరించారు.ప్రతి ఏడాది తరహాలో ఈసారి సైతం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి మంగళవారం రాత్రి 8 గంటల వరకు ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయని తెలిపారు. బత్తిని కుటుంబం ఇచ్చే చేప ప్రసాదం కోసం వచ్చే భక్తులు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి బస్సులు, కార్లలో వచ్చే వారు గాంధీభవన్ లేదా గృహకల్ప బస్టాప్‌ల వైపు నుంచి రావాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. అలాగే ఆటోల్లో వచ్చే భక్తుల సౌకర్యార్థం షెజాన్ హోటల్ వద్ద ప్రత్యేకంగా ఆటోలు ఆగే స్థలం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాంపల్లి పరిసర రోడ్లలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు, సాధారణ ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## నేడు ఢిల్లీలో సమావేశం కానున్న విపక్ష ఇండియా కూటమి

మొదటిపేజీ తరువాయి..

తమ కూటమి భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమన్న ఇండియా కూటమి, భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నా ఐక్యంగానే ఉన్నామన్నారు. ఇవాళ ఈ సమావేశానికి 23 పార్టీలు హాజరుకానున్నాయని, పలు రాష్ట్రాల్లో జరగబోయే శాసనసభ ఎన్నికల వ్యూహాలపై ఇండి కూటమి చర్చించనున్నట్లు నేతలు తెలిపారు. ఈ సమావేశానికి డీఎంకే, ఆప్ పార్టీలు దూరంగా ఉండనున్నాయి. భారత్ లాగే 'ఇండియా జన్ బంధన్' కూడా తన వైవిధ్యాన్ని చాటుకుంటూ ఐక్యంగా ముందుకు సాగుతుందని జైరాం రమేష్ స్పష్టం చేశారు. 2029 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తు కార్యాచరణను రూపొందించడంపై ఇండి కూటమి సమావేశం కానుంది. జాతీయ సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని ఉమ్మడి వ్యూహాలతో ఎలా నిలదీయాలనే అంశంపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై విస్తృతంగా చర్చలు జరిపే అవకాశం ఉంది. వేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాల దృష్ట్యా విపక్ష పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు



ఈ భేటీ కీలకం కానుంది.అయితే, ఎక్స్ పోస్టులో జైరాం రమేశ్ ఇంకా కొన్ని విషయాలను పంచుకున్నారు. కోట్లాది మంది భారతీయుల ఓటు హక్కును కాలరాయడంతో పాటు రాజ్యాంగంపై దాడి, విపక్షాలను దర్యాప్తు బృందాలు లక్ష్యంగా చేసుకోవడం వంటి పరిణామాలను ఆయా పార్టీలు ఖండించాయని ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. అలాగే, కోట్లాది మంది భారతీయుల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీస్తూ, ఎడతెరిపి లేని ధరల పెరుగుదలతో కుటుంబ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తూ, లక్షలాది యువత ఆశలు, ఆకాంక్షలకు ద్రోహం చేస్తూ, పెట్టుబడుల వాతావరణాన్ని నీరుగారుస్తూ, తన విదేశాంగ విధానంతో జాతీయ ప్రయోజనాలను దెబ్బతీస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలు, చర్యలకు పార్టీల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని తెలిపారు. ఇక, ఈ భేటీ విషయానికొస్తే, వ్యక్తిగత కారణాల వల్ల కొన్ని పార్టీలు ఈ సమావేశానికి హాజరుకాలేక పోతున్నాయని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఇండి కూటమిలోని కొన్ని భాగస్వామ్య పక్షాల మధ్య సంబంధాలు ఉద్రిక్తంగా ఉన్న తరుణంలో ఈ సమావేశం జరుగుతోంది. తమిళనాడులో కాంగ్రెస్ 'ద్రోహం' చేసిందని ఆరోపిస్తూ డీఎంకే ఈ సమావేశానికి గైర్హాజరు కానుండగా, కేరళలో వామపక్షాలు బీజేపీతో కుమ్మక్కయ్యాయని కాంగ్రెస్ అగ్ర నాయకులు చేసిన ఆరోపణలపై సీపీఐ(ఎం) అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కూటమికి ఆప్ బహిరంగంగానే దూరంగా ఉండగా, ఈ సమావేశాన్ని బహిష్కరించాలని డీఎంకే ఇదివరకే నిర్ణయం ప్రకటించింది.

# మెట్రో విస్తరణకు అడ్డుపుల్ల

మొదటిపేజీ తరువాయి..

మొబైల్ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ నూతన యాప్ ద్వారా నగర ప్రజలు తమ ఆస్తి పన్ను, విద్యుత్, నీటి బిల్లులను సులభంగా చెల్లించే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీలో యమునా రివర్ ఫ్రంట్ పేరుతో అభివృద్ధి చేసుకుంటారు. యూపీలో గంగా నదిని అక్కడి ప్రభుత్వాలు ప్రక్షాళన చేస్తున్నాయని ప్రధాని




నరేంద్ర మోదీ గొప్పగా చెబుతున్నారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. కానీ, తెలంగాణలో మూసీ ప్రక్షాళన చేస్తామంటే మాత్రం ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు.

రాజకీయాలు కేవలం ఎన్నికల సమయంలోనే ఉండాలని, అభివృద్ధిలో కాదని హితవు పలికారు. ఇతర రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళనను సమర్థించే బీజేపీ నేతలు, మూసీ ప్రక్షాళనపై రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు. జూన్ 15 తర్వాత తెలంగాణ ప్రభుత్వ కార్యాచరణ మారుతుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్ మెట్రో విస్తరణకు ఎందుకు అనుమతి ఇవ్వరో, మన రైతులు పండించిన ధాన్యాన్ని ఎందుకు పూర్తిగా కొనరో, రీజినల్ రింగ్ రోడ్డుకు నిధులు ఎందుకు కేటాయించరో.. వాటి సంగతి చూస్తామన్నారు. మంచి పనుల విషయంలో రాజకీయం చేయవద్దని ప్రతిపక్షాలకు సూచించారు. నన్ను ఎవ్వరూ ఏం చేయలేరని కిషన్ రెడ్డి అంటున్నాడు. అయితే ఇక్కడి ప్రజలతో పెట్టుకున్నోడు, తెలంగాణ ప్రజలతో గోక్కున్నోడు చరిత్రలో బాగుపడి బట్టకట్టినోడు లేడన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో దాదాపు 1.34 కోట్ల మంది జనాభా ఉన్నారని, ఇంత భారీ సంఖ్యలో ఉన్న ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం సాధారణ విషయం కాదన్నారు. నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో రైలు ప్రతిపాదన చేశాం. 122 కి.మీ మేర మెట్రో విస్తరణకు అన్ని అనుమతులు వచ్చాక మన కేంద్రమంత్రి కాళ్ళల్లో కట్టెలు, పుల్లలు పెట్టి అర్ధాంతరంగా ఆపేశారని ఆరోపించారు. రీజినల్ రింగ్ రోడ్డు కోసం కాలుకు బలపం కట్టుకొని తిరుగుతున్నప్పటికీ.. అనుమతులు రాకుండా ఎవరు ఆపుతున్నారు? అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

పరిపాలనా సౌలభ్యం కోసమే జీహెచ్ఎంసీ ని మూడుగా విభజిస్తే, కొందరు రాజకీయ లబ్ధి కోసమేనంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను తొలగించేందుకే ఉప్పల్‌లో మున్సిపల్ ఆఫీసును ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాజకీయంగా కష్టాల్లో ఉన్న సమయంలో తనను మల్కాజిగిరి ప్రజలే ఎంపీగా గెలిపించారని గుర్తు చేసుకున్నారు. గతంలో కేంద్రం సహకారం లేకపోవడం వల్లే అనుకున్న పనులు చేయలేకపోయానని, ఇప్పుడు ముఖ్యమంత్రిగా మల్కాజిగిరి నియోజకవర్గాన్ని పూర్తిగా అభివృద్ధి చేసే బాధ్యతను తానే తీసుకుంటున్నానని చెప్పారు

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో రూ.1,511 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

మొదటిపేజీ తరువాయి..

మున్సిపల్ కార్పొరేషన్ పరిపాలనను మరింత సులభతరం చేసేందుకు ఉప్పల్ భగాయత్ ఫేజ్-3 లోని 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.98 కోట్లతో నిర్మించనున్న నూతన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవనానికి సీఎం శంకుస్థాపన చేశారు. వీటితో పాటు రూ.960 కోట్లతో ఏఓసీ సెంటర్‌లో ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణం, రూ.416 కోట్లతో టీకేఆర్ కాలేజ్ జంక్షన్‌లో 6 వరుసల ఫ్లైఓవర్ నిర్మాణం, రూ.37.50 కోట్లతో 100 పడకల మల్కాజిగిరి జిల్లా ఆసుపత్రి భవన నిర్మాణ పనులకు ఆయన శ్రీకారం చుట్టారు.నాగోల్ నుంచి గౌరెల్లి వరకు మూసీ నది ప్రక్షాళన ఫేజ్-2 పనులను రాబోయే వంద రోజుల్లోనే ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దేశంలోని సబర్మతి, యమునా, గంగా నదుల తరహాలోనే మూసీని కూడా ప్రక్షాళన చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలు పడుతున్న కాలుష్య బాధలను, నల్గొండ జిల్లాపై పడుతున్న దుష్ప్రభావాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ క్రమంలో ఏ పేదవాడికీ అన్యాయం జరగనివ్వమని, ఇళ్లు కోల్పోయే బాధితులకు ప్రత్యామ్నాయ గృహ వసతితో పాటు వారి పిల్లలకు మంచి చదువులు చెప్పించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఔటర్ రింగ్ రోడ్ (లోపల ఉన్న 2100 చదరపు కిలోమీటర్ల పరిధిని 'క్యూర్' (కోర్ అర్బన్ రీజినల్ ఎకానమీ) ప్రాంతంగా గుర్తించి, పరిపాలనా సౌలభ్యం కోసం హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి అనే మూడు కార్పొరేషన్లుగా వికేంద్రీకరించినట్లు సీఎం తెలిపారు. నగర రవాణాను మెరుగుపరిచేందుకు 122 కిలోమీటర్ల మేర మెట్రో రైలును విస్తరించనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా నాగోల్ నుంచి ఎల్బీనగర్, ఓవైసీ హాస్పిటల్ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు, అలాగే ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు మెట్రోను విస్తరిస్తామన్నారు. ఈ అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో తాను మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు ఆశించిన స్థాయిలో పనులు చేయలేకపోయానని గుర్తుచేసుకున్న సీఎం, ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఈ ప్రాంత అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇచ్చే బాధ్యతను తానే స్వయంగా తీసుకుంటానని ప్రకటించారు. అలాగే, ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు బండారి రాజిరెడ్డి పేరు పెడతామని, చౌరస్తాలో వారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని సీఎం రేవంత్ రెడ్డి సభలో హామీ ఇచ్చారు.

## జూన్ 15న స్కూల్స్ రీఓపెనింగ్

మొదటిపేజీ తరువాయి..

తెలంగాణ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ కీలక ఆదేశాలు జారీ చేశారు. వాస్తవానికి వేసవి సెలవుల తర్వాత జూన్ 12న పాఠశాలలను తిరిగి తెరవాలని విద్యాశాఖ భావించింది. అయితే ఆ తర్వాతి రోజుల్లో అంటే జూన్ 13న రెండో శనివారం, జూన్ 14న ఆదివారం వచ్చాయి. కేవలం ఒక్క రోజు అంటే జూన్ 12న స్కూళ్లు తెరిచి, ఆ వెంటనే వరుసగా రెండు రోజులు సెలవులు రావడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నుండి ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు అందాయి. ఈ విజ్ఞప్తులను సానుకూలంగా పరిశీలించిన ప్రభుత్వం, విద్యార్థుల సౌకర్యార్థం రీఓపెనింగ్ తేదీని జూన్ 15 సోమవారంకి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది.పాఠశాలల పునఃప్రారంభం ఆలస్యం కావడం వల్ల విద్యార్థులు కోల్పోయే విద్యా సమయాన్ని, నిర్దేశిత పనిదినాలను భర్తీ చేసేందుకు విద్యాశాఖ ప్రత్యామ్నాయ మార్గాన్ని ప్రకటించింది. అకడమిక్ క్యాలెండర్ 2026-27 ప్రకారం పనిదినాల నియమాలను పాటించేందుకు గానూ.. వచ్చే నెల జూలై 11 వచ్చే రెండో శనివారాన్ని సాధారణ పనిదినగా మార్చారు.

## మీ తాటాకు చప్పుళ్లకు భయపడను

మొదటిపేజీ తరువాయి..

సీఎం రేవంత్‌పై కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాసమస్యలపై ధర్నాలు, పోరాటాలు చేసి తాను ఈ స్థాయికి ఎదిగానని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు వ్యక్తిగత దూషణలు చేసుకోవడం తప్ప పని చేసే అలవాటు లేదని



ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి తానేం చేశానో చెప్పేందుకు తనకు రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఈ జన్మలో ప్రధాన మంత్రి కాలేరని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాహుల్ నాయకత్వ వైఫల్యం వల్ల కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రాల్లో గుండు సున్నా ఫలితాలు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఇక, 'ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి. వడ్లకు బోనస్ ఇవ్వలేదు. రుణమాఫీ అరకొర చేశారు. నిరుద్యోగ భృతి ఏమైంది? బీసీలకు లక్ష కోట్లు ఏమైంది?' అంటూ సీఎం రేవంత్ రెడ్డిని కిషన్‌రెడ్డి నిలదీశారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆర్థిక సంస్థలు రుణాలు ఇస్తే కానీ రాష్ట్ర ప్రభుత్వానికి పూట గడిచే పరిస్థితి లేదన్నారు. రేవంత్ మాటలు కొండలు, కోటలు దాటుతున్నాయని, చేతలు మాత్రం సచివాలయం గేటు దాటడం లేదని విమర్శించారు. తెలంగాణ రాజకీయ ప్రస్థానంలో అధికారం మారినా ప్రజల ఆకాంక్షలు మాత్రం నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. "అడ్డగోలుగా అబద్ధపు హామీలు, అడుగడుగునా నమ్మకద్రోహం నడుమ క్షేత్రస్థాయి సమస్యలు గాలికి వదిలేసి గాల్లో మేడలు కడుతూ... విదేశాలపై వ్యామోహం చూపిస్తూ సొంత దేశంలో జరుగుతున్న అభివృద్ధిపై కారుకూతలు కూసిన ముఖ్యమంత్రుల గ్రాఫ్ పాతాళానికి పడిపోయింది. ఇలాగే మాట్లాడిన కేసీఆర్‌ను ప్రజలు ఫాంహౌస్‌కు పరిమితం చేశారు. ఇప్పుడు సీఎం సీటులో ఉన్న రేవంత్ కూడా తీవ్ర ప్రజా వ్యతిరేకత మూటగట్టుకుంటున్నారు. ఆయనకూ అదే గతి తప్పదు' అని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేదంటే దళితులు, బీసీలు సీఎం ఇంటి ముందు ధర్నాలు చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## రక్షణ, భద్రత, వాణిజ్యంపై విస్తృత చర్చలు

### ఇండోనేసియాతో భారత్ సమావేశం

రక్షణ, భద్రత, సముద్రయానం, వాణిజ్యం, పెట్టుబడులు, ఆరోగ్యం, ఔషధాలు, ఆహార భద్రత, పర్యాటకం, విద్య సాంస్కృతిక సహకారం వంటి అంశాలపై ఇండోనేసియా విదేశాంగ మంత్రి సుగియోనోతో విస్తృతమైన చర్చలు జరపనున్నానని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ వ్యాఖ్యానించారు. గతంలో తాను ఇండోనేసియా అధ్యక్షుడు అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోను కలిసినప్పుడు బహుముఖ ద్వైపాక్షిక సంబంధాలను మరింత అభివృద్ధి చేయడంపై ఆయన అందించిన మార్గదర్శకత్వాన్ని ఎంతో విలువైనదిగా భావించానని చెప్పారు. ఆ పర్యటనలో ప్రధాని మోదీ, ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో మధ్య చాలా ఫలప్రదమైన చర్చలు జరిగాయని వెల్లడించారు. ఈ చర్చలు ఇరు దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి మంచి ఊపునిచ్చాయని పేర్కొన్నారు. ఎనిమిదో భారత్-ఇండోనేసియా జాయింట్ కమిషన్ సమావేశం ఢిల్లీలో జరిగింది. ఈ మీటింగ్‌లో భారత్, ఇండోనేసియా విదేశాంగ మంత్రి మంత్రులు డాక్టర్ ఎస్. జైశంకర్, సుగియోనోలు కీలక అంశాలపై చర్చించారు.ఎనిమిదో భారత్-ఇండోనేసియా జాయింట్ కమిషన్ సమావేశం కోసం మీకు (సుగియోనో), మీ ప్రతినిధి బృందానికి ఢిల్లీలో స్వాగతం పలకడం చాలా సంతోషంగా ఉంది. గత నెలలో బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశం సందర్భంగా మనం కలుసుకునే అవకాశం లభించింది. మీరు మళ్లీ భారతదేశాన్ని సందర్శించడానికి సమయం కేటాయించినందుకు అభినందనలు. నాలుగేళ్ల తర్వాత మళ్లీ భారత్-ఇండోనేషియా జాయింట్ కమిషన్ సమావేశం జరుగుతోంది. ఈ నాలుగేళ్ల కాలంలో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలు మంచి పురోగతిని సాధించాయి. 2025నాటికి భారత్, ఇండోనేసియా దేశాలు తమ ద్వైపాక్షిక సంబంధాల 75వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నాయి. అలాగే గతేడాది దేశ 76వ గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో వచ్చారు. ఆయనకు స్వాగతం పలికే గౌరవం మాకు దక్కిందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జకార్తా పర్యటనను దృష్టిలో ఉంచుకుని ఈ సమావేశం ఫలప్రదంగా ఉంటుందని, మంచి ఫలితాలను ఇస్తుందని తాను ఆశిస్తున్నానని ఇండోనేసియా విదేశాంగ మంత్రి సుగియోనో వ్యాఖ్యానించారు. తనకు, తన ప్రతినిధి బృందానికి అందించిన ఆప్యాయమైన ఆతిథ్యానికి ధన్యవాదాలు తెలియజేశారు. వాస్తవానికి కొన్ని వారాల క్రితమే తాను ఢిల్లీ పర్యటనకు వచ్చానని, మళ్లీ రావడానికి ఏదో ఒక కారణాన్ని వెతుకుతూనే ఉన్నానని చెప్పారు. ఈ పర్యటన మన రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలపరుస్తుందని తాను భావిస్తున్నానని వెల్లడించారు. త్వరలో భారత ప్రధాని ఇండోనేసియా పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో భారత్, ఇండోనేసియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు మేము ఎంతటి ప్రాధాన్యం ఇస్తున్నామో ఈ సమావేశం తెలియజేస్తుంది. ఈ సమావేశం ఫలప్రదంగా ఉంటుందని, అనేక ఫలితాలను ఇస్తుందని ఆశిస్తున్నా. అలాగే జకార్తాలో ప్రధాని మోదీకి స్వాగతం పలికే ఏర్పాట్లకు దోహదపడుతుందని భావిస్తున్నాం.

## తెలుగు రాష్ట్రాలను తాకిన నైరుతి రుతుపవనాలు..

మొదటిపేజీ తరువాయి..

ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, మణిపూర్, మిజోరాంలను పూర్తిగా చుట్టేసిన రుతుపవనాలు.. త్రిపుర, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్‌లలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించాయి. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఈ విస్తరణకు మరింత బలాన్ని ఇస్తోంది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం.. రాబోయే 48 నుంచి 72 గంటల్లో నైరుతి రుతుపవనాలు తెలంగాణలోని పలు జిల్లాల్లోకి ప్రవేశించడానికి పూర్తి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం తూర్పు ఉత్తరప్రదేశ్ నుండి ఛత్తీస్‌గఢ్ మీదుగా తెలంగాణ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఒక బలమైన ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. అయితే వర్షాలు పడినా, గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో రానున్న మూడు రోజులు పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని స్పష్టం చేశారు. మరోవైపు అమరావతి వాతావరణ కేంద్రం ఆంధ్రప్రదేశ్, యానాం ప్రజలకు కీలక సూచనలు చేసింది. ప్రస్తుతం కోస్తా కర్ణాటక పరిసర ప్రాంతాల నుండి కోస్తా ఆంధ్రప్రదేశ్ వరకు సముద్ర మట్టానికి 3.1 నుంచి 4.6 కిలోమీటర్ల ఎత్తులో ఒక అల్పపీడన ద్రోణి విస్తరించి ఉంది. దీని ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో రాగల మూడు రోజులు వాతావరణం విభిన్నంగా మారనుంది. సోమ, మంగళవారాల్లో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చు. అదే సమయంలో అక్కడక్కడా తీవ్రమైన వడగాలులు వీచే ప్రమాదం కూడా పొంచి ఉంది. వర్షాలు కురిసే సమయంలో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తెలిపింది. రాయలసీమ ప్రాంతంలో వాతావరణం మరింత వేగంగా మారుతోంది. ఈరోజు రాయలసీమలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పాటు, ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. బలమైన గాలుల కారణంగా చేతికి వచ్చిన పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులను హెచ్చరించారు. ఇక దక్షిణ కోస్తాంధ్రలో వర్షాలు పడినా, వాతావరణంలో తేమ శాతం పెరగడం వల్ల వేడి, ఉక్కపోత విపరీతంగా ఉంటాయని పేర్కొన్నారు. ఉక్కపోత కారణంగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యే అవకాశం ఉంది. రాబోయే ఐదు రోజుల్లో ఎండల తీవ్రత కొద్దిగా తగ్గినప్పటికీ, ఉష్ణోగ్రతలు మాత్రం స్థిరంగానే కొనసాగుతాయని వాతావరణ కేంద్రం సంచాలకులు వెల్లడించారు.

## తొలి ట్రిలియనీర్‌గా నిలిచేందుకు అడుగు దూరం

మొదటిపేజీ తరువాయి..

దీని విలువ సుమారు 273 బిలియన్ డాలర్లు. అయితే, ఆయన మరో సంస్థ స్పేస్‌ఎక్స్ త్వరలో స్టాక్ మార్కెట్‌లో అడుగుపెడితే (ఐపీఓ), ఆయన సంపదకు అదనంగా మరో 841 బిలియన్ డాలర్లు జతయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో ఆయన నికర సంపద 1 ట్రిలియన్ డాలర్ల మార్కును సులభంగా దాటుతుంది. ఈ సంపదంతా బ్యాంకులో ఉన్న నగదు కాదని, కంపెనీలలో ఆయనకున్న వాటాల రూపంలో ఉంటుందని, దీని విలువ మార్కెట్ పనితీరుపై ఆధారపడి ఉంటుందని గమనించాలి. ఒక ట్రిలియన్ డాలర్లంటే భారత కరెన్సీలో సుమారు 95 లక్షల కోట్ల రూపాయలు. ఈ సంపద విలువ ప్రపంచంలోని చాలా దేశాల వార్షిక ఆర్థిక వ్యవస్థల (జీడీపీ) కంటే ఎక్కువ కావడం గమనార్హం. ఉదాహరణకు తైవాన్ (ఏ977 బిలియన్లు), ఐర్లాండ్ (ఏ779 బిలియన్లు), స్వీడన్ (ఏ760 బిలియన్లు), సింగపూర్ (ఏ660 బిలియన్లు) వంటి అభివృద్ధి చెందిన దేశాల జీడీపీ కంటే కూడా మస్క్ సంపదే ఎక్కువగా ఉంటుంది. అంతేగాక ప్రపంచ ఆర్థిక కేంద్రమైన మాన్‌హట్టన్ వార్షిక ఆర్థిక ఉత్పత్తి (ఏ1 ట్రిలియన్)తో ఇది సమానంగా ఉంది. మస్క్ తోటి టెక్ బిలియనీర్లతో పోల్చినప్పుడు ఈ సంపద స్థాయి మరింత స్పష్టంగా అర్థమవుతుంది. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్, ఒరాకిల్ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్, గూగుల్ సహ వ్యవస్థాపకులు లారీ పేజ్, సెర్గీ బ్రిన్ వంటి పలువురు అగ్రశ్రేణి కుబేరులందరి మొత్తం సంపద కలిపితే సుమారు ఏ1.09 ట్రిలియన్లు ఉంటుంది. అంటే, వీరందరి సంపద కేవలం మస్క్ ఒక్కడి సంపద కంటే కొంచెమే ఎక్కువ. అంతేకాకుండా అమెరికాలోని ప్రధాన నగరమైన హ్యూస్టన్‌లోని నివాస, వాణిజ్య ఆస్తులన్నింటి మొత్తం విలువ (ఏ879 బిలియన్లు) కంటే కూడా మస్క్ సంపద ఎక్కువ. ఇక క్రీడారంగంతో పోలిస్తే, ఫోర్బ్స్ జాబితా ప్రకారం ప్రపంచంలోని 50 అత్యంత విలువైన స్పోర్ట్స్ జట్ల మొత్తం విలువ కేవలం 353 బిలియన్ డాలర్లు మాత్రమే. అంటే.. మస్క్ తన సంపదతో ప్రపంచంలోని దాదాపు అన్ని ప్రధాన స్పోర్ట్స్ జట్లను సులభంగా కొనుగోలు చేయగలరు. ప్రస్తుత మార్కెట్ అంచనాలు ఇలాగే కొనసాగితే, మస్క్ ఈ అసాధారణ మైలురాయిని అందుకోవడం ఖాయమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# మీకు హిట్లరే స్ఫూర్తి ..

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డికి హిట్లరే స్ఫూర్తి అని, ఆయన నియంతలను పూజిస్తారని ఆరోపించారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "మీ స్ఫూర్తి హిట్లర్! మీ హంతక ఏజెన్సీ పేరు హైడ్రా! మీరు నియంతలను పూజిస్తూ, కూల్చివేతల గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు" అని కేటీఆర్ తన పోస్టులో ఘాటుగా విమర్శించారు. "మేం మీ అంత తెలివైన వాళ్లం కాదు రేవంత్! అందుకే మేం అంబేద్కర్ రాజ్యాంగం, గాంధీజీ దార్శనికత, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పాలించాం" అని పేర్కొన్నారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, హైడ్రా పేరు వెనుక తనకు స్ఫూర్తి హిట్లర్ అని వెల్లడించారు. హిట్లర్ కు హైడ్రా అనే టీమ్ ఉండేదని, హిట్లర్ ప్రత్యర్థుల పనిబట్టడమే ఆ టీమ్ పని అని పేర్కొన్నారు. రేవంత్ చేసిన ఈ వ్యాఖ్యలపై దుమారం రేగుతోంది.

కాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో పెను దుమారం రేపుతున్నాయి. రాష్ట్రంలో ఆక్రమణల తొలగింపు, విపత్తుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన 'హైడ్రా' (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) వ్యవస్థకు జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్ స్ఫూర్తితో పేరు పెట్టానని ఆయన స్వయంగా చెప్పడమే ఈ వివాదానికి కారణమైంది. బెంగళూరులో నిన్న జరిగిన 'ది హిందూ' హడిల్ సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. చెరువులు, ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలపై హైడ్రా ఏజెన్సీ తీసుకుంటున్న కఠిన చర్యలను సమర్థించుకుంటూ రేవంత్ రెడ్డి మాట్లాడారు. "హైడ్రా అనే పదం హిట్లర్‌కు చాలా ఇష్టమైనది. ఆయన కోర్ టీమ్‌ను హైడ్రా అని పిలిచేవారు, వారు ఎవరినైనా హతమార్చగలరు. అందుకే నేను హిట్లర్ నుంచి స్ఫూర్తి పొంది దీనికి హైడ్రా అని పేరు పెట్టాను" అని ఆయన వివరించారు.


POONAWALLA FINCORP

## పూనావాలా ఫిన్‌కార్ప్ లిమిటెడ్

కార్పొరేట్ కార్యాలయం: యూనిట్ నం. 2401, 24వ అంతస్తు, ఆల్టిమస్, డా. జి.ఎం. భోసలే మార్గ్, వర్లి, ముంబై - 400 018, మహారాష్ట్ర
నమోదిత కార్యాలయం: 201 మరియు 202, 2వ అంతస్తు, AP81, కోరెగావ్ పార్క్ అనెక్స్ ముంధ్వా, పూణే - 411 036, మహారాష్ట్ర
కార్యాలయ యూనిట్: డోర్ నం. 40-25-80/1, 3వ అంతస్తు, ఆర్.ఎస్. టవర్స్, బెంజ్ సర్కిల్ విజయవాడ - 520 010

**స్థిరాస్తుల అమ్మకపు ప్రకటన**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 (దీనిని ఇకపై "యాక్ట్" అని పిలుస్తారు) మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6) నిబంధనల ప్రకారం తాకట్టు పెట్టబడిన సురక్షిత స్థిరాస్తి విక్రయం కొరకు ఇ-వేలం విక్రయ ప్రకటన.
ఇందుమూలంగా సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(ల)కు తెలియజేయునది ఏమనగా కింద పేర్కొన్న ఆస్తులు పూనావాలా **ఫిన్‌కార్ప్ లిమిటెడ్ కు తాకట్టు పెట్టబడ్డాయి. ఈ చట్టంలోని సెక్షన్ 14 కింద పూనావాలా ఫిన్‌కార్ప్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి చేత భౌతిక స్వాధీనం చేసుకోబడిన ఈ ఆస్తులు,** రుణగ్రహీత/(సహ-రుణగ్రహీతలు) నుండి పూనావాలా ఫిన్‌కార్ప్ లిమిటెడ్‌కు చెల్లించాల్సిన బాకీ మొత్తం **రూ. 6,03,73,129/- (అక్షరాలా ఆరు కోట్ల మూడు లక్షల డెబ్బై మూడు వేల వంద ఇరవై తొమ్మిది రూపాయలు మాత్రం)** రికవరీ కోసం **"ఎక్కడ ఎలా ఉందో అక్కడ అలా", "ఉన్నది ఉన్నట్లుగా" మరియు "ఏదయితో ఉందో అది"** ప్రాతిపదికన **25.06.2026** తేదీన విక్రయించబడతాయి. దీనికి సంబంధించిన వివరాలు కింద పేర్కొనబడ్డాయి:

| 1. రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతల పేరు<br>2. డిమాండ్ నోటీసు తేదీ<br>3. మొత్తం బకాయి + వడ్డీ | ఆస్తి వివరాలు & ఆస్తి స్వభావం | 1. ప్రైవేట్ ట్రీటీ ద్వారా నిర్వహించే ఈ-వేలం తేదీ మరియు సమయం<br>2. ఇఎండి (ఎర్నెస్ట్ మనీ డిపాజిట్) సమర్పించడానికి చివరి తేదీ<br>3. ఆస్తి తనిఖీ తేదీ మరియు సమయం | 1. రిజర్వ్ ధర (లక్షలలో)<br>2. ఇఎండి అమౌంట్ (లక్షలలో) |
|---|---|---|---|
| 1. బాటో లాజిస్టిక్స్<br>షెనాజ్ పాట్నీ<br>జరీనా పాట్నీ<br>ఐషా జహాన్ పత్నీ<br>మహమ్మద్ ఇమ్రాన్ పాట్నీ<br>బాటో కార్గో మూవర్స్<br>బాంబే ఆంధ్ర ట్రాన్స్‌పోర్ట్<br>ఆర్గనైజేషన్ కార్గో<br>2. నోటీసు తేదీ: 19.03.2025<br>3. లోన్ నం.: LAP0026100000008107606<br>4. మొత్తం బకాయిలు: రూ. 6,03,73,129/- (అక్షరాలా ఆరు కోట్ల మూడు లక్షల డెబ్బై మూడు వేల నూట ఇరవై తొమ్మిది రూపాయలు మాత్రమే) 19.03.2025 నాటికి చెల్లించవలసిన మొత్తం; దీనిపై చెల్లింపు జరిగే వరకు 9.90% చొప్పున వడ్డీ కూడా వర్తిస్తుంది. | కృష్ణా జిల్లా, విజయవాడ పట్టణం, పటమట, కంచుకోటవారి వీధిలోని సర్వే నంబర్ 9/1లో గల మున్సిపల్ వార్డ్ నంబర్ 32D, ప్రాంగణ సంఖ్య 59/6-6 వద్ద 'రీజెన్సీ ఎన్‌క్లేవ్' అనే భవనంలోని మొదటి అంతస్తులో, కామన్ ఏరియాలతో కలిపి 1400 చదరపు అడుగుల ప్లింత్ ఏరియా కలిగిన 'B' నంబర్ గల ఫ్లాట్; దీనితో పాటు 200 చదరపు అడుగుల విస్తీర్ణం గల స్లాట్ నంబర్ 7లో 20 చదరపు అడుగుల కార్ పార్కింగ్; అలాగే 666 చదరపు గజాల స్థలంలో 55.5 చదరపు గజాల అవిభాజ్య భూమి వాటా యొక్క యావత్తు; సరిహద్దులు: ఉత్తరం - ఖాళీ స్థలం, దక్షిణం - ఖాళీ స్థలం, తూర్పు - ఖాళీ స్థలం, పడమర - కామన్ ఏరియా, లిఫ్ట్ మరియు మెట్ల దారి.<br>**షెడ్యూల్ -II**: విజయవాడ నగరం, కృష్ణా జిల్లా, పటమటలోని కంచుకోటవారి వీధిలో గల మున్సిపల్ వార్డు 32D, సర్వే నంబర్ 9/1లో ఉన్న మొత్తం 666 చదరపు గజాల స్థలంలో, 111 చదరపు గజాల విస్తీర్ణానికి సంబంధించిన 11.1 చదరపు గజాల అవిభాజ్య భూమి వాటాతో కూడిన, 'రీజెన్సీ ఎన్‌క్లేవ్' భవనంలోని 20 చదరపు అడుగుల నిర్మిత ప్రాంతం కలిగిన స్టిల్ట్ ఫ్లోర్ ప్రాంగణ నం. 59-6-6. **సరిహద్దులు :** ఉత్తరం: ఘంటా రామచందర్ రావు మరియు ఇతరుల ఆస్తి; దక్షిణం: కంచుకోటవారి వీధిలోని 30 అడుగుల వెడల్పు గల మున్సిపల్ రోడ్డు; తూర్పు: యలమంచిలి నాగేశ్వరరావు ఆస్తి; పడమర: యలమంచిలి నాగేశ్వరరావు ఆస్తి. | 1. ఈ-వేలం తేదీ మరియు సమయం: **25.06.2026 (ఉ. 11 గం. నుండి సాయంత్రం 4 గంటల వరకు)**<br>2. ఇఎండి (ఎర్నెస్ట్ మనీ డిపాజిట్) సమర్పించడానికి చివరి తేదీ: **24.06.2026 సా. 5 గం.లకు ముందు**<br>3. ఆస్తి తనిఖీ తేదీ మరియు సమయం: **22.06.2026 (ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు)** | 1. రిజర్వ్ ధర (లక్షలలో): **రూ. 69,61,500/-** (అరవై తొమ్మిది లక్షల అరవై ఒక వేల ఐదు వందల రూపాయలు మాత్రమే).<br>2. ఇఎండి అమౌంట్ (లక్షలలో) **రూ. 6,96,150/-** (ఆరు లక్షల తొంభై ఆరు వేల ఒక వంద యాభై రూపాయలు మాత్రమే). |

ఈ అమ్మకానికి సంబంధించిన నిబంధనలు మరియు షరతులు క్రింద ఇవ్వబడ్డాయి; అలాగే, వీటి పూర్తి వివరాలు మాయొక్క/సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క వెబ్‌సైట్‌లో ఈ క్రింది లింక్ వద్ద అందుబాటులో ఉన్నాయి: (https://poonawallafincorp.com/pdf/Properties-for-Auction.pdf).
వేలంలో పాల్గొనదలచిన వారు సంబంధిత శాఖను మరియు వేలం వేయబడుతున్న ఆస్తులను స్వయంగా సందర్శించి, వాటికి సంబంధించిన ఛార్జీలు మరియు ఆస్తిపై ఉన్న ఇతర బాధ్యతలు లేదా చట్టపరమైన భారం వంటి వివరాలను తెలుసుకోవాలని సూచించడమైనది. కొనుగోలుదారు స్వయంగా విచారణ జరిపి, అదనపు ఛార్జీలు, ఆస్తిపై ఉన్న భారం మరియు ఏవైనా మూడవ పక్షం హక్కులు వంటి అంశాలను నిర్ధారించుకోవాలి మరియు అన్ని విధాలుగా సంతృప్తి చెందాలి. ఆస్తికి సంబంధించిన ఆస్తి పన్నులు, విద్యుత్ బకాయిలు మరియు ఇతర ఏవైనా బకాయిలు ఉంటే, వాటిని వేలంలో గెలిచిన వారు లేదా కొనుగోలు చేయదలచిన వారు స్వయంగా తెలుసుకుని చెల్లించాల్సి ఉంటుంది. బిడ్లను సమర్పించే ముందే, పైన పేర్కొన్న ఆస్తి/ఆస్తులకు సంబంధించిన వివరాలు మరియు ఇతర అంశాలపై పూర్తి అవగాహనతో సంతృప్తి చెందాలని వేలంపాటదారులు/కొనుగోలు చేయదలచిన వారికి సూచించడమైనది.
ఆసక్తి గల బిడ్డర్లు తప్పనిసరిగా ఈ-వేలం కోసం ముందుగానే పోర్టల్‌లో తమను తాము నమోదు చేసుకుని, లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్ పొందాలి. ఇందుకోసం వేలం సర్వీస్ ప్రొవైడర్ **M/s Augeo అసెట్ మేనేజ్‌మెంట్**, H-182, సెక్టార్-63, నోయిడా - 201301, సంప్రదింపు నంబర్లు: ०917428993244 / ०917428695102 ఇ-మెయిల్: shekhar.s@cartradeexchange.com ను సంప్రదించవచ్చు. ఈ-వేలానికి సంబంధించిన ఆన్‌లైన్ శిక్షణను కూడా భావి బిడ్డర్లు పై సర్వీస్ ప్రొవైడర్ నుంచే పొందవచ్చని గమనించండి. వేలంలో పాల్గొనదలచిన కొనుగోలుదారు/బిడ్డర్, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ **(ఇఎండి) మొత్తాన్ని NEFT/RTGS/DD ద్వారా క్రింది ఖాతాలో జమ చేయాలి: అకౌంట్ పేరు: పూనావాలా ఫిన్‌కార్ప్ లిమిటెడ్, బ్యాంక్: ICICI బ్యాంక్ లిమిటెడ్, సి సిఅకౌంట్ నం.: 000651000350, IFSC కోడ్: ICIC0000006, 20, ఆర్.ఎన్. ముఖర్జీ రోడ్, కోల్‌కతా -700001.** ఈ మొత్తాన్ని **24.06.2026** తేదీ లోపు జమ చేయాలి. అనంతరం https://augeo.samil.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని, ఉచితంగా యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్ పొందాలి. అలాగే సర్వీస్ ప్రొవైడర్ నుండి ఈ-వేలానికి సంబంధించిన శిక్షణ కూడా పొందాలి. వెబ్‌సైట్‌లో నమోదు పూర్తైన తరువాత, ఆసక్తి గల కొనుగోలుదారు/బిడ్డర్ క్రింది పత్రాల ప్రతులను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు, ఇ-మెయిల్ ద్వారా పంపి, స్వీయ ధృవీకరణ చేసిన హార్డ్ కాపీలను (పూనావాలా ఫిన్‌కార్ప్ లిమిటెడ్ అధీకృత అధికారికు) పంపించాలి. **శ్రీ వి.ఎస్. సాయి గణేష్ వెలమూరి, పూనావాలా ఫిన్‌కార్ప్ లిమిటెడ్, 3వ అంతస్తు, ఆర్.ఎస్. టవర్, డోర్ నం. 40-25-80/1, రెవెన్యూ వార్డు 13A, కుర్ర సత్యనారాయణ వీధి, గాయత్రి నగర్, బెంజ్ సర్కిల్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520010. మొబైల్ నం.: 8712299319 ఇ-మెయిల్: v.velamuri@poonawallafincorp.com.**

**SARFAESI చట్టం, 2002 ప్రకారం చట్టబద్ధమైన 15 రోజుల నోటీసు**
1. పైన పేర్కొన్న మొత్తాన్ని, దానికి సంబంధించిన ప్రస్తుత వడ్డీ మరియు అనుబంధ ఖర్చులతో సహా, ఈ-వేలం తేదీలోపు చెల్లించవలసిందిగా రుణగ్రహీతకు/సహ-రుణగ్రహీతలకు దీని ద్వారా తెలియజేయడమైనది. ఒకవేళ చెల్లించడంలో విఫలమైతే, తాకట్టు ఉంచిన ఆస్తి వేలం వేయబడుతుంది లేదా విక్రయించబడుతుంది; అలాగే ఏవైనా బకాయిలు మిగిలి ఉంటే, వాటిని వడ్డీ మరియు ఖర్చులతో సహా వసూలు చేయడం జరుగుతుంది.


**ప్రదేశం: విజయవాడ (ఆంధ్రప్రదేశ్)**
**తేది: 08.06.2026**

**అధీకృత అధికారి,**
**పూనావాలా ఫిన్‌కార్ప్ లిమిటెడ్**


## టీవీకే ప్రభుత్వం కనీసం మూడు నెలలైనా నిలబడుతుందా?

మొదటిపేజీ తరువాయి..

చేరారు. ఈ సందర్భంగా స్టాలిన్ ఈ మేరకు మాట్లాడారు. ఇప్పటికే చాలామంది కొత్త ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని స్టాలిన్ పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచే డీఎంకే, 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం క్షేత్రస్థాయిలో చర్యలు మొదలు పెట్టిందని వెల్లడించారు. బూత్ స్థాయి ఏజెంట్లను నియమించడం, ప్రాంతీయ సమావేశాలు నిర్వహించడం వంటి జాగ్రత్తలు తీసుకున్నా అధికారంలోకి రాలేకపోయామని నిర్వేదం వ్యక్తం చేశారు. కానీ కొందరు మాత్రం ఓటర్లను కలవకపోయినా, బూత్ ఏజెంట్లను నియమించకపోయినా ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని పరోక్షంగా విజయ్‌ను ఉద్దేశిస్తూ స్టాలిన్ అన్నారు. అటువంటి ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉంటుందని తాను భావించట్లేదని తెలిపారు. ఇక, డీఎంకేలో కొత్తగా చేరిన వారికి స్టాలిన్ పలు సూచనలు చేశారు. పార్టీ నిర్వహించే అన్ని సంస్థాగత



కార్యక్రమాల్లోనూ సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే, గతంలో అనుబంధం కలిగి ఉన్న పార్టీలను విమర్శించవద్దని సూచించారు. ఈ సందర్భంగా, పార్టీ వ్యవస్థాపకుడు సి.ఎన్. అన్నాదురై మాటలను ఉటంకిస్తూ, "ప్రత్యర్థి తోటలోని మల్లెపూవునకు కూడా సువాసన ఉంటుందని అన్నా (అన్నాదురై) గొప్పగా చెప్పారు. కాబట్టి, ఎవరినీ తక్కువ అంచనా వేయాల్సిన అవసరం లేదు" అని స్టాలిన్ దిశానిర్దేశం చేశారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో వీసీకే తరపున చెయ్యూర్ నియోజకవర్గం నుంచి పనైయూర్ బాబు విజయం సాధించారు. అయితే, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల విషయంలో పార్టీ నాయకుడు తిరుమావళవన్ పరస్పర విరుద్ధమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. తరచుగా తన వైఖరిని మారుస్తున్నారని ఆరోపిస్తూ ఆయన వీసీకేను వీడారు. మరోవైపు, తమిళనాడులో టీవీకే ఎక్కువ కాలం అధికారంలో ఉండదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి వ్యాఖ్యానించారు. కుర్చీకి ఉన్న నాలుగు కాళ్లలో రెండు విరిగిపోతే అది ఎలాగైతే కుప్పకూలిపోతుందో, టీవీకే ప్రభుత్వం కూడా అలాగే కూలిపోతుందని విమర్శించారు. ఇటీవల తమిళనాడులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే సంపూర్ణ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదు. అంతేకాదు, రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో ఒక్క నియోజకవర్గంలో కూడా ఆ పార్టీ గెలవలేకపోయింది. టీవీకే కుర్చీకి రెండు కాళ్లు మాత్రమే ఉన్నాయి. మిగిలిన రెండు కాళ్లు డీఎంకే కూటమిలో గెలిచిన పార్టీలకు చెందినవి. కాబట్టి ఆ పార్టీలు ఎప్పుడైనా విడిపోవచ్చు" అని పళనిస్వామి వ్యాఖ్యానించారు. అలాగే, టీవీకే నాయకుడు ఆవేశపూరిత ప్రకటనలు చేయడం మానుకోవాలని పళనిస్వామి అన్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో 436 పథకాలను అమలు చేస్తామని ప్రకటించారని, అయితే, ఆ పథకాలు ఏ శాఖలకు చెందినవి అనే విషయంపై ఎటువంటి వివరాలు వెల్లడించలేదని తెలిపారు. కేవలం పథకాలను ప్రకటించడం ద్వారా టీవీకే ప్రజలను మోసం చేస్తోందని ఆయన విమర్శించారు.


PVV Infra Ltd.

## PVV INFRA LTD.

CIN No. L70102AP1995PLC111705
Registered Office: Plot No. 42,D.No. 54-28/3-5, Opp: Gurudwara, Behind. OBC Bank, Gurunanak Colony, District- Vijayawada Andhra Pradesh - 520008,
Ph No. 0866-2544224, Email id: info@pvvinfra.com, www.pvvinfra.com

**CORRIGENDUM TO THE NOTICE OF THE EXTRAORDINARY GENERAL MEETING**

An Extraordinary General Meeting ("EGM") of the Members of PVV Infra Limited (the "Company") is scheduled to be held on **Saturday, June 13, 2026** at 11:00 A.M. (IST) through Video Conferencing ("VC") / Other Audio Visual Means ("OAVM"). The Notice of the EGM ("EGM Notice") was dispatched to the shareholders of the Company on May 21, 2026, in due compliance with the provisions of the Companies Act, 2013 and rules made thereunder, read with the applicable circulars issued by the Ministry of Corporate Affairs and the Securities and Exchange Board of India. Capitalised words and expressions used but not defined herein shall have the same meaning as assigned to them in the EGM Notice.

This Corrigendum is being issued to amend and supplement the Explanatory Statement annexed to the EGM Notice, pursuant to the provisions of the Securities and Exchange Board of India (Issue of Capital and Disclosure Requirements) Regulations, 2018 ("SEBI ICDR Regulations"). The following amendments / additions are hereby made to the Explanatory Statement in respect of Item No. 2 (Issuance of Convertible Equity Share Warrants on a Preferential Basis, for Cash):

**1. AMENDMENT TO SECTION (a) - OBJECTS OF THE PREFERENTIAL ISSUE**

The existing Section (a) 'Objects of the Preferential Issue' in the Explanatory Statement in respect of Item No. 2 is hereby amended and substituted with the following:

The Company proposes to raise funds aggregating up to Rs. 49,87,50,000/- (Rupees Forty-Nine Crore Eighty-Seven Lakh Fifty Thousand only) through issuance of Convertible Equity Share Warrants on a preferential basis, for cash. The net proceeds raised from the Preferential Issue shall be utilised for the following purposes:

| Sr. No. | Particulars / Objects | Amount (Rs.) | % of Total Issue Size |
|---|---|---|---|
| 1 | Working Capital Requirements of the Company | Rs. 34,91,25,000/- | 70% |
| 2 | General Corporate Purposes | Rs. 12,46,87,500/- | 25% |
| 3 | Issue Related Expenses | Rs. 2,49,37,500/- | 5% |
| | **Total** | **Rs. 49,87,50,000/-** | **100%** |

***Note:** The above utilisation schedule is indicative. The actual deployment of funds may vary based on business requirements, market conditions, and the timing and quantum of exercise of the Warrants. The funds shall be deployed in a phased manner as the Warrants are exercised by the allottees and the balance 75% of the issue price is received by the Company. The Company shall disclose the actual utilisation of proceeds in accordance with the applicable provisions of the SEBI (LODR) Regulations, 2015.*

**2. ADDITION OF SECTION - PRE AND POST PREFERENTIAL ISSUE SHAREHOLDING PATTERN OF THE ISSUER [REGULATION 163(1)(d) OF SEBI ICDR REGULATIONS, 2018]**

The following disclosure is hereby added to the Explanatory Statement in respect of Item No. 2, pursuant to Regulation 163(1)(d) of the SEBI ICDR Regulations:

The Pre and Post Preferential Issue Shareholding Pattern of the proposed allottees in the Company (on a fully diluted basis, assuming full exercise and conversion of all 6,65,00,000 Convertible Equity Share Warrants into Equity Shares) is as under:

***Note:** Pre-issue shareholding is computed on a fully diluted basis assuming full payment of call money on all 9,86,64,284 partly paid-up equity shares allotted pursuant to the Rights Issue on February 23, 2026. Pre-issue fully diluted capital = 21,37,72,616 equity shares. Post-issue fully diluted capital (upon full conversion of all Warrants) = 28,02,72,616 equity shares.*

| Sr. | Name of Proposed Allottee | Category | No. of Warrants | Pre-Issue Equity Shares (FD) | Pre-Issue % | Post-Issue Equity Shares (FD, upon full conversion | Post-Issue % | Status Post -Issue |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | Pinnamaneni Estates Private Limited | Promoter | 1,38,65,250 | 4,45,71,428 | 20.85% | 5,84,36,678 33,10,000 | 20.85% | Promoter |
| 2 | Krishna Karthik Pothur | Non-Promoter | 19,95,000 | 13,15,000 | 0.06% | 30,00,000 | 1.18% | Non-Promoter |
| 3 | Codemosaic Systems Private Limited | Non-Promoter | 30,00,000 | 0 | 0.00% | 25,00,000 | 1.07% | Non-Promoter |
| 4 | Frostbond Private Limited | Non-Promoter | 25,00,000 | 0 | 0.00% | 32,00,000 | 0.89% | Non-Promoter |
| 5 | Eastern Pocket Software Private Limited | Non-Promoter | 32,00,000 | 0 | 0.00% | 28,00,000 | 1.14% | Non-Promoter |
| 6 | Flamingo Information Private Limited | Non-Promoter | 28,00,000 | 0 | 0.00% | 29,00,000 | 1.00% | Non-Promoter |
| 7 | Great Origin Tech Pvt. Ltd. | Non-Promoter | 29,00,000 | 0 | 0.00% | 28,00,000 | 1.03% | Non-Promoter |
| 8 | Hazelhood Solutions Pvt. Ltd. | Non-Promoter | 28,00,000 | 0 | 0.00% | 21,00,000 | 1.00% | Non-Promoter |
| 9 | Rosepetal IT Solutions Private Limited | Non-Promoter | 21,00,000 | 0 | 0.00% | 25,00,000 | 0.75% | Non-Promoter |
| 10 | Ezemode Consultancy Private Limited | Non-Promoter | 25,00,000 | 0 | 0.00% | 26,00,000 | 0.89% | Non-Promoter |
| 11 | Adhigam Software Private Limited | Non-Promoter | 26,00,000 | 0 | 0.00% | 22,00,000 | 0.93% | Non-Promoter |
| 12 | Metoza Innovate Private Limited | Non-Promoter | 22,00,000 | 0 | 0.00% | 26,00,000 | 0.78% | Non-Promoter |
| 13 | Secpl Engineering Construction Pvt. Ltd. | Non-Promoter | 26,00,000 | 0 | 0.00% | 28,00,000 | 0.93% | Non-Promoter |
| 14 | Chausa Technologies Pvt. Ltd. | Non-Promoter | 28,00,000 | 0 | 0.00% | 31,00,000 | 1.00% | Non-Promoter |
| 15 | Mani Software Technologies Pvt. Ltd. | Non-Promoter | 31,00,000 | 0 | 0.00% | 24,00,000 | 1.11% | Non-Promoter |
| 16 | Winslet Tech Private Limited | Non-Promoter | 24,00,000 | 0 | 0.00% | 27,00,000 | 0.86% | Non-Promoter |
| 17 | Satveer Trading Private Limited | Non-Promoter | 27,00,000 | 0 | 0.00% | 24,09,750 | 0.96% | Non-Promoter |
| 18 | Jivika Clothing Private Limited | Non-Promoter | 24,09,750 | 0 | 0.00% | 32,00,000 | 0.86% | Non-Promoter |
| 19 | Constructpeak Builders Private Limited | Non-Promoter | 32,00,000 | 0 | 0.00% | 2,50,000 | 1.14% | Non-Promoter |
| 20 | Ganga Ghanathe | Non-Promoter | 2,50,000 | 0 | 0.00% | 2,80,000 | 0.09% | Non-Promoter |
| 21 | Sneha Ghanathe | Non-Promoter | 2,80,000 | 0 | 0.00% | 2,40,000 | 0.10% | Non-Promoter |
| 22 | Sonal Ghanathe | Non-Promoter | 2,40,000 | 0 | 0.00% | 3,00,000 | 0.09% | Non-Promoter |
| 23 | Sunil Ghanathe | Non-Promoter | 3,00,000 | 0 | 0.00% | 2,60,000 | 0.11% | Non-Promoter |
| 24 | Sidharth Rahul Nandagiri | Non-Promoter | 2,60,000 | 0 | 0.00% | 32,00,000 | 0.09% | Non-Promoter |
| 25 | Arruttlas Supplies Private Limited | Non-Promoter | 32,00,000 | 0 | 0.00% | 2,00,000 | 1.14% | Non-Promoter |
| 26 | Boppudi Sehsagiri Rao | Non-Promoter | 2,00,000 | 0 | 0.00% | 50,000 | 0.07% | Non-Promoter |
| 27 | Manvi Gupta | Non-Promoter | 50,000 | 0 | 0.00% | 50,000 | 0.02% | Non-Promoter |
| 28 | Sarvesh Kumar | Non-Promoter | 50,000 | 0 | 0.00% | | 0.02% | Non-Promoter |
| | **Total** | | **6,65,00,000** | | | | | |

Shareholding pattern of the issuer before and after the preferential issue Regulation 163 (1) (d) of ICDR 2018

| Category | # Pre-Issue Shareholding | | *Post-Issue Shareholding | |
|---|---|---|---|---|
| | Number of shares held | % of shareholding | Number of shares held | % of shareholding |
| **PROMOTER GROUP** | | | | |
| A. Promoter & Promoter Group | 45949040 | 21.49 | 5,98,14,290 | 21.34 |
| B. Person acting in concert with the Promoter | - - | - - | - - | - - |
| **Total Promoters holding** | **45949040** | **21.49** | **5,98,14,290** | **21.34** |
| **NON- PROMOTER GROUP** | | | | |
| Institutional Investors | - | - | - | - |
| Foreign Institutional Investors | - | - | - | - |
| Body Corporate | 67869680 | 31.75 | 116879430 | 41.70 |
| Non- Institutional Investors | - | - | - | - |
| NRI/OCBs | 4982719 | 2.33 | 4982719 | 1.78 |
| Clearing Members | 0 | 0 | 0 | 0 |
| Others Including Public and Trustees | 94971177 | 44.43 | 98596177 | 35.18 |
| **Total Public holding** | **167823576** | **78.51** | **220458326** | **78.66** |
| **Total** | **213772616** | **100.00** | **280272616** | **100.00** |

**3. ADDITION OF SECTION - CURRENT AND PROPOSED STATUS OF PROPOSED ALLOTTEES [REGULATION 163(1)(j) OF SEBI ICDR REGULATIONS, 2018]**

The following disclosure is hereby added to the Explanatory Statement in respect of Item No. 2, pursuant to Regulation 163(1)(j) of the SEBI ICDR Regulations:

The current status (pre-preferential issue) and proposed status (post-preferential issue) of the proposed allottees as Promoter or Non-Promoter is set out below:

| Sr. No. | Name of Proposed Allottee | No. of Warrants Proposed to be Allotted | Current Status (Pre-Issue) | Proposed Status (Post-Issue) | Remarks |
|---|---|---|---|---|---|
| 1 | Pinnamaneni Estates Private Limited | 1,38,65,250 | Promoter | Promoter | No change in status |
| 2 | Krishna Karthik Pothur | 19,95,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 3 | Codemosaic Systems Private Limited | 30,00,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 4 | Frostbond Private Limited | 25,00,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 5 | Eastern Pocket Software Private Limited | 32,00,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 6 | Flamingo Information Private Limited | 28,00,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 7 | Great Origin Tech Pvt. Ltd. | 29,00,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 8 | Hazelhood Solutions Pvt. Ltd. | 28,00,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 9 | Rosepetal IT Solutions Private Limited | 21,00,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 10 | Ezemode Consultancy Private Limited | 25,00,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 11 | Adhigam Software Private Limited | 26,00,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 12 | Metoza Innovate Private Limited | 22,00,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 13 | Secpl Engineering Construction Pvt. Ltd. | 26,00,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 14 | Chausa Technologies Pvt. Ltd. | 28,00,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 15 | Mani Software Technologies Pvt. Ltd. | 31,00,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 16 | Winslet Tech Private Limited | 24,00,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 17 | Satveer Trading Private Limited | 27,00,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 18 | Jivika Clothing Private Limited | 24,09,750 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 19 | Constructpeak Builders Private Limited | 32,00,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 20 | Ganga Ghanathe | 2,50,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 21 | Sneha Ghanathe | 2,80,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 22 | Sonal Ghanathe | 2,40,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 23 | Sunil Ghanathe | 3,00,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 24 | Sidharth Rahul Nandagiri | 2,60,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 25 | Arruttlas Supplies Private Limited | 32,00,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 26 | Boppudi Sehsagiri Rao | 2,00,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 27 | Manvi Gupta | 50,000 | Non-Promoter | Non-Promoter | No change in status |
| 28 | Sarvesh Kumar | 50,000 | Non-Promoter | Non-Promoter | No change in status |

Further, it is hereby confirmed that none of the 28 proposed allottees shall, individually or collectively, acquire control over the Company as a result of the proposed Preferential Issue. The existing Promoters of the Company shall continue to be in control of the Company after the Preferential Issue.

**4. VALUATION REPORT**

The following disclosure is hereby added to the Explanatory Statement in respect of Item No. 2, pursuant to Regulation 163 (2) of ICDR 2018

The Certificate issued by A. Somesh Rao., Registered valuer, certifying that the preferential issue is being made in accordance with the requirements contained in the SEBI ICDR Regulations will be made available for inspection by the members during the Meeting and will also be made available on the Company's website and will be accessible at https://pvvinfra.com/UPLOAD_DOCUMENTS/Valuation-report-signed-RV_PVV-Infra-14-05-2026-aabc-final.pdf

This Corrigendum to the EGM Notice shall form an integral part of the EGM Notice, which has already been circulated to the shareholders of the Company, and on and from the date hereof, the EGM Notice shall always be read in conjunction with this Corrigendum. This Corrigendum is also being published in Financial Express (English language), and Sakshyam daily (Telugu language) and will also be made available on the website of the Company at www.pvvinfra.com. All other contents of the EGM Notice, save and except as modified or supplemented by this Corrigendum, shall remain unchanged.

**By Order of the Board of Directors**
**For PVV Infra Limited**
**Sd/-**
**Akhilesh Kumar**
**Company Secretary & Compliance Officer**

**Place: Vijayawada**
**Date: June 06, 2026**

## తెలంగాణలో క్లినికల్ సైకాలజీ వృత్తి బలోపేతానికి కార్యాచరణ



**సికింద్రాబాద్, జూన్ 7 (సాక్ష్యం):** తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ క్లినికల్ సైకాలజిస్ట్స్ (టీఏసీపీ) సర్వసభ్య సమావేశం ఆదివారం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్యవర్గ సభ్యులు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు, క్లినికల్ సైకాలజిస్టులు ఈ సమావేశానికి హాజరయ్యారు. తెలంగాణలో క్లినికల్ సైకాలజీ వృత్తిని మరింత బలోపేతం చేయడం, మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వృత్తిపరమైన సహకారాన్ని విస్తరించడం, సభ్యుల చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వంటి కీలక అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నూతన కార్యనిర్వాహక కమిటీని సభ్యులకు అధికారికంగా పరిచయం చేశారు. సంఘం నిర్మాణం, బాధ్యతలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు, సభ్యుల పాత్రలపై సమగ్ర అవగాహన కల్పించారు. అడ్వొకసీ అండ్ పబ్లిక్ అవేర్‌నెస్, ఎథిక్స్ అండ్ లీగల్ అడ్వైజరీ, ట్రైనింగ్ అండ్ ఎడ్యుకేషనల్, సోషల్ మీడియా, గవర్నమెంట్ లైజన్ టాస్క్ ఫోర్స్ కమిటీల లక్ష్యాలు, విధులు, భవిష్యత్ కార్యక్రమాలపై సవివరంగా చర్చలు జరిగాయి. రాష్ట్రంలోని క్లినికల్ సైకాలజిస్టుల వృత్తిపరమైన అభివృద్ధి, ప్రజల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపు, విధానపరమైన అంశాలపై ప్రభుత్వ స్థాయిలో చర్చలు జరిపే వ్యూహాలపై సభ్యులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. మానసిక ఆరోగ్య సేవల అభివృద్ధికి, క్లినికల్ సైకాలజిస్టుల వృత్తిపరమైన హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు టీఏసీపీ కట్టుబడి ఉందని నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల మానసిక శ్రేయస్సు కోసం మరిన్ని అవగాహన కార్యక్రమాలు, శిక్షణా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో టీఏసీపీ సలహా కమిటీ సభ్యురాలు డా. సరోజ్ ఆర్య, అధ్యక్షురాలు డా. వృషాలి రెడ్డి, ఉపాధ్యక్షుడు డా. సోమశేఖర్, కార్యదర్శి శిల్పా పన్నాల, సంయుక్త కార్యదర్శి గీతా మాగేష్, కోశాధికారి అంజన్‌కుమార్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## గంట సోమనర్సయ్య మృతి అత్యంత బాధాకరం

### మాజీ మంత్రి ఎర్రబెల్లి



**పాలకుర్తి,జూన్ 7(సాక్ష్యం):** పాలకుర్తి మండలం,వావిలాల గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు గంట సోమనర్సయ్య మృతి పట్ల మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం వారి నివాసానికి వెళ్లి సోమనర్సయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దుఃఖంలో తాను భాగస్వామినని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంట సోమనర్సయ్య ఉపాధ్యాయ వృత్తికి అంకితభావంతో సేవలందించిన ఆదర్శ వ్యక్తి అని,విద్యార్థుల భవిష్యత్తు కోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప గురువుగా గుర్తుండిపోతారని అన్నారు. సోమ నర్సయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులను పరామ ర్శించారు. వారి వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ కుమార్, మండల బిఆర్ఎస్ నాయకులు, గ్రామస్థాయి సోషల్ మీడియా, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వం రైతులు పండించిన

## ప్రతీ గింజ కొనే వరకు పోరాడుతా

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**పాలకుర్తి, జూన్07 (సాక్ష్యం):** మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకి తమ గోడు వెళ్ళబోసుకున్న పాలకుర్తి మండలం, ఈరవెన్ను గ్రామ రైతులు.పండించిన ధాన్యం అమ్మడానికి పడరాని పాట్లు పడుతున్నామని, నెలలకొద్ది ఈ ఎండలో పడి చస్తున్నామని, బస్తాలు కూడా సరిగా ఇవ్వట్లేదని,లారీలు కూడా లేవని ట్రాక్టర్లలో పండిన పంటని తరలించేందుకు బస్తాకు 5 రూపాయలు వసూలు చేస్తున్నారని రైతులు తమ గోస వెళ్ళబుచ్చారు.లి వెంటనే స్పందించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఈరవెన్ను గ్రామానికి వెళ్ళి ధాన్యం కొనుగోలు సెంటర్ పరిశీలించి అధికారులతో మాట్లాడి తమ సమస్యలు పరిష్కారం చూపుతానని రైతులకు భరోసా నిచ్చారు. .ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ ఎన్నడు లేని విధంగా రైతులను ఇబ్బందులు పెట్టడం కాంగ్రెస్ పార్టీకి తగదని,ప్రభుత్వం మెడలు, వంచైన,రైతుల పక్షాన ఉద్యమిస్తాం, ప్రతి గింజ కొనే వరకు పోరాడుతామని,ఎర్రటి ఎండలో,రైతులను చూస్తే రేవంత్ రెడ్డి కి గోస అనిపిస్తా లేదా?ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రైతులకు విత్తనాలు,ఎరువులు ఇవ్వలేకపోతోందని,సకాలంలో రైతుబంధు ఇవ్వకపోగా కనీసం పండిన పంటను మద్దతు ధరకు కొనే పరిస్థితిలో కూడా లేదని,ఇది ముమ్మాటికీ రైతు వ్యతిరేక ప్రభుత్వమని,రైతులు 2 నెలల నుంచి పడిగాపులు కాస్తున్నామని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని,ఈ ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడాలని,సరిగా లారీలు లేక బస్తా సంచులేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని,వడ్లు ఇంకా రోడ్ల మీదనే ఉన్నాయని,ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి వడ్లు కొనుగోలు వేగవంతం చేసి రైతులని ఆదుకోవాల్సిందిగా డిమాండ్ చేస్తున్నానని అన్నారు.

## భూపాలపల్లిలో టీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ

### టిఆర్ఎస్ జిల్లా ఇన్చార్జి నరేష్ నేత



**భూపాలపల్లి జూన్ 7 (సాక్ష్యం) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఆదివారం జెండా పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భూపాలపల్లి జిల్లా ఇన్చార్జి నరేష్ నేత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర అబ్జర్వర్ మేడల అభిలాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రకటించిన 'పంచజన్యం' హామీలను ప్రజలకు వివరించారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి కల్పన, వ్యవసాయ అభివృద్ధి, సామాజిక న్యాయం వంటి అంశాలపై పార్టీ కట్టుబాటును వివరించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అబ్జర్వర్ వల్లకొండ అజయ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సిద్ధిక్ షేక్, బుర్ర వినోద్, గోవర్ధన్, సంతోష్, ఉద్యమ నాయకురాళ్లు భారతమ్మ, పద్మలత, యువ నాయకులు, విద్యార్థి నాయకులు, హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు, మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### కోల్ మైన్స్ కార్మిక సంఘం

## అధ్యక్షునిగా అప్పాని శ్రీనివాస్ ఏకగ్రీవ ఎన్నిక

**భూపాలపల్లి జూన్ 7 (సాక్ష్యం) :** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో భారతీయ మజ్దూర్ సంఘ్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరిగింది అనంతరం భారతీయ మజ్దూర్ సంఘ్ కోల్ మైన్స్ కార్మిక సంఘం అధ్యక్షునిగా అప్పాని శ్రీనివాస్ ఏకగ్రీవ ఎన్నిక. చేయడం జరిగింది బిఎంఎస్ కోల్ బెల్ట్ ఇన్చార్జి లక్ష్మారెడ్డి. ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం



అప్పాని శ్రీనివాస్ మాట్లాడుతూ నామీద నమ్మకంతో ఈ బాధ్యత నాకు అప్ప గించినందుకు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాను సంఘం అభివృద్ధి కోసం పనిచేస్తానని వారు తెలిపారు.

## భవిష్యత్ నాయకుల తయారీకి ఉస్మానియా కామర్స్ కళాశాల కృషి

### ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వార్షికోత్సవ వేడుకలు



**సికింద్రాబాద్,జూన్ 7 (సాక్ష్యం):** ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ (యూసీసీ అండ్ బీఎం)లో గ్రాడ్యుయేషన్ డే, వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేశ్ రెడ్డి ముఖ్య అతిథిగా, వైస్ ఛాన్సలర్ ప్రత్యేకాధికారి ప్రొఫెసర్ ఎస్. జితేందర్ కుమార్ నాయక్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె. శశికాంత్, మేనేజ్మెంట్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ డి. శ్రీరాములు, కామర్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ కె. కృష్ణ చైతన్య, కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం. గంగాధర్, బిజినెస్ మేనేజ్మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ వై. జహంగీర్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు. స్వాగతోపన్యాసంలో ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్ కళాశాల విద్యా, పరిశోధన, ప్లేస్మెంట్లు, పరిశ్రమలతో భాగస్వామ్యాలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో సాధించిన విజయాలను వివరించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ జి. నరేశ్ రెడ్డి మాట్లాడుతూ, పట్టభద్రులు ఉద్యోగాల కోసం వెతికేవారిగా కాకుండా ఉద్యోగాలను కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి విశ్వవిద్యాలయం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రులకు కన్వొకేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే సుల్తాన్ చంద్ ఫౌండేషన్ ట్రస్ట్ అందించిన రూ.5 లక్షల విరాళంతో ఎం.కాం.లో ప్రథమ ర్యాంకు సాధించే విద్యార్థికి స్వర్ణ పతకం ఏర్పాటు చేయడం విశేషంగా నిలిచింది. క్రీడలు, విద్యా రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందిని సన్మానించారు. కళాశాల అభివృద్ధికి తోడ్పడిన పూర్వ విద్యార్థులు, స్పాన్సర్లు, అధ్యాపకులకు ప్రత్యేక సత్కారం నిర్వహించారు. ఈ వేడుకలు విద్యా ప్రతిభ, పరిశోధన, సామాజిక బాధ్యతతో కూడిన నాయకత్వాన్ని పెంపొందించాలనే ఉస్మానియా విశ్వవిద్యాలయ సంకల్పాన్ని ప్రతిబింబించాయి.





## కబడ్డీ మ్యాట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎస్ఆర్





**భూపాలపల్లి, జూన్ 7 (సాక్ష్యం)** ఈరోజు ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన కబడ్డీ మ్యాట్‌ను గౌరవ భూపాలపల్లి శాసనసభ్యులు శ్రీ గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే గారు కబడ్డీ పోటీలను ప్రారంభించి క్రీడాకారులతో కలిసి కొంతసేపు కబడ్డీ ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావన,నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తామని,యువత క్రీడలను సద్వినియోగం చేసుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారులు,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ బట్టు కరుణాకర్ గారు, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ శ్రీ బుర్ర కొమురయ్య గౌడ్ గారు, కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి టౌన్ అధ్యక్షులు శ్రీ ఇస్లావత్ దేవన్ గారు,క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు, యువకులు మరియు పలువురు అభిమానులు పాల్గొన్నారు.

### పెరిగిన ధరలను నిరసిస్తూ 10న

## కలెక్టరేట్ ఎదుట ధర్నాను విజయవంతం చేయాలి

### సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా



**వర్ధన్నపేట, జూన్ 7(సాక్ష్యం):** పెరిగిన ధరలను నిరసిస్తూ ఈ నెల 10న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టిన ధర్నా ను విజయవంతం చేయాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా ప్రజలకు పిలుపునిచ్చారు. వర్ధన్నపేట మండల కేంద్రం లో ఆదివారం సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం కడమంచి యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ధరల పెరుగుదలను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ ధర్నా ను విజయవంతం చేయాలని కోరారు.రోజు రోజుకు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, సామాన్యుడు బతికే పరిస్థితి లేకుండా పోయిందని, బియ్యం, పప్పులు, నూనెలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్, చివరకు కూరగాయల ధరలు కూడా సామాన్య, మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్‌ను అతలాకుతలం చేస్తున్నాయని తెలిపారు. ఈ ధరల పెరుగుదలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని పేర్కొన్నారు. దీంతో ఇల్లు గడవడమే భారంగా మారిన పేద ప్రజల భవిష్యత్తు మరింత అంధకారమవుతున్నదన్నారు. తక్షణమే నిత్యావసరాల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సబ్సిడీపై రేషన్ వస్తువులను అందించాలని, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలపై పన్నులను తగ్గించి, సామాన్యుడికి ఉపశమనం కలిగించాలని ఆయన కోరారు. మార్కెట్‌లో నల్లబజారు, కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలను నిరసిస్తూ జూన్ 10న జిల్లా కలెక్టర్ కార్యాలయాలం ముందు ఆందోళన చేపట్టినట్లు, ఈ ఆందోళన కార్యక్రమాలలో జిల్లా వ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో జిల్లా సమితి సభ్యులు ఆరెల్లి రవి మండల సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి సాయిలు ఆరెల్లి ప్రభాకర్, రాజు.యాకుబ్, తాటికాయల మహేందర్, రామకృష్ణ గణేష్ ఐలయ్య గోలి యాకమ్మ., తదితరులు పాల్గొన్నారు.

### పదో తరగతి,

## ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

**కోదాడ జూన్ 07(సాక్ష్యం)** కోదాడ మండల పరిధిలోని రామలక్ష్మిపురం గ్రామంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అన్నెం స్రవంతి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంగిరెడ్డి తులిశమ్మ కన్నారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభ కనబర్చి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకరావాలని కోరారు. అత్యధిక మార్కులు సాధించిన అన్నెం ఉజ్వల, వర్షిని, కొప్పుల శరణ్య, ఎడవల్లి మనోజ్, అన్నెం సూర్య ప్రకాష్ రెడ్డి, భాను ప్రకాష్, వారి తల్లిదండ్రులను మెమొంటు శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు



సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నెం పాపిరెడ్డి, రామాలయం గుడి చైర్మన్ కొప్పుల సుబ్బారెడ్డి, రామాలయం వైస్ చైర్మన్ అన్నెం నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ సీతారాములు, వార్డ్ మెంబర్లు కన్నా రెడ్డి కళావతి సుజాత ధనలక్ష్మి వెంకట రమణ, పాపయ్య, భాస్కర్, సీతారామరెడ్డి, పాపిరెడ్డి పాల్గొన్నారు.

### యాదగిరి నరసన్న

## సేవలో కేంద్ర మంత్రి



**యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్...** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. ఆలయానికి వచ్చిన కేంద్రమంత్రికి ఈవో భవాని శంకర్, ఆలయ అర్చకులు ఆలయ సాంప్రదాయ స్వాగతం పలికారు. ఆదివారం కేంద్ర మంత్రి ఉదయం స్వామివారి నిత్యాభిషేకంలో పాల్గొన్నారు. దర్శనానంతరశీ కేంద్రమంత్రికి ఆలయ ముఖమండపం లో వేద పండితులు, అర్చకులు వేద ఆశీర్వచనం చేసి, అనంతరం ఆలయ ఈవో లడ్డు ప్రసాదం స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

## యాదాద్రి పుణ్యక్షేత్రంలో నిత్యారాధనలు

### యాదగిరిగుట్టలో భక్తజన సందోహం





**యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్..** పంచనారసింహులు కొలువై ఉన్న యాదాద్రి పుణ్యక్షేత్రంలో అదివారం భక్తజనుల ఆరాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి.వరుస సెలవులు ఆదివారం సెలవురోజు కావడంతోయాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో పెరిగిన భక్తుల రద్దీ పెరిగింది.ఉదయం నుంచే తమ కుటుంబ సభ్యులతో క్యూలైన్ల లో బారులు తీరిన భక్తులు..భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ఆలయ మాడవీధులు,కళ్యాణకట్ట, పుష్కరిణి, వ్రత మండపం, వాహనాల పార్కింగ్, ఘాట్ రోడ్డు పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ధర్మ దర్శనం.రెండున్నర గంటల సమయం,ప్రత్యేక ప్రవేశ దర్శనం. గంటన్నర సమయం పడుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు క్షేత్రాన్ని సందర్శించి హరి, హరులను దర్శించుకున్నారు. భక్తులు తమ కుటుంబీకులతో కొండ కింద లక్ష్మీ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, సంకల్పం చేపట్టారు. పలువురు తలనీలాలు సమర్పించారు. శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

## భూపాలపల్లి జిల్లాలో
# నిషేధిత అంబర్ గుట్కా ప్యాకెట్ల స్వాధీనం




**భూపాలపల్లి సాక్ష్యం న్యూస్ జూన్ 7**
భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, సీసీఎస్ సీఐ రమేష్ గారి ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసులు అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న నిషేధిత పొగాకు ఉత్పత్తులపై నిర్వహించిన తనిఖీలలో భాగంగా భూపాలపల్లి మండలం ఖాసింపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ యూసుఫ్ (36) వద్ద నుండి అంబర్ (అనార్ బ్రాండ్) గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 6 సంచుల్లో, ఒక్కో సంచిలో 200 ప్యాకెట్ల చొప్పున మొత్తం 1,200 ప్యాకెట్లు లభించగా, వాటి విలువ సుమారు రూ. 1,92,000/-గా అంచనా వేయబడింది. స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అభిప్రాయం పొందిన అనంతరం, నిందితుడిని స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించడం జరిగింది. నిషేధిత పొగాకు ఉత్పత్తులను నిల్వ ఉంచడం, రవాణా చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ఉప సర్పంచుల ఫోరం
# జిల్లా అధ్యక్షుడిగా సుర్కంటి శ్రీధర్ రెడ్డి ఎన్నిక



**చౌటుప్పల్ జూన్ 7 (సాక్ష్యం)**
యాదాద్రి భువనగిరి జిల్లా ఉపసర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా చౌటుప్పల్ మండలం మంద్దోళ్ళ గూడెం ఉపసర్పంచ్ సుర్కంటి శ్రీధర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భువనగిరిలో జరిగిన ఉపసర్పంచుల ఫోరం జిల్లా సమావేశంలో శ్రీధర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉప సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా నా యొక్క ఎన్నికకు సహకరించిన జిల్లా ఉపసర్పంచులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచుల హక్కుల కోసం పోరాడుతానని పేర్కొన్నారు. ఉప సర్పంచులకు చెక్ పవర్ రద్దు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని లేనిచో ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## నేడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో
# బూత్ లెవల్ ఎజెంట్స్ శిక్షణా కార్యక్రమం
### ముఖ్య అతిథులుగా ఎంపీ కడియం కావ్య ఝాన్సీ రెడ్డి



**పాలకుర్తి, జూన్ 07(సాక్ష్యం):**
పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర కల్యాణ మండపం నందు పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని బూత్ లెవల్ ఎజెంట్స్ శిక్షణ కార్యక్రమం పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, బూత్ లెవల్ ఏజెంట్స్ శిక్షణ ట్రైనర్ అల్లం కోటేశ్వరరావు, పాలకుర్తి నియోజకవర్గ టీపీసీసీ పరిశీలకులు దుద్దిల్ల శ్రీనివాస్, టీపీసీసీ అబసర్వర్ ప్రమోద్ కుమార్, జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు డా, భూక్య ఉమా మురళి నాయక్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆయుబ్ ఖాన్ పాల్గొననున్నారు.

# సత్వర న్యాయానికి లోక్ అదాలత్ ఉత్తమ వేదిక
### జూన్ 20 జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి: జిల్లా ఎస్పీ జానకి



**మహబూబ్‌నగర్, జూన్ 7 ( సాక్ష్యం బ్యూరో ) :**
ప్రజలకు తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో న్యాయం అందించేందుకు నిర్వహించబడుతున్న జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ దరావత్ జానకి కోరారు. జూన్ 20న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయం ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆమె ఈ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా ట్రాఫిక్ చలానాలు, రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులు, కుటుంబ వివాదాలు, సివిల్ కేసులు తదితర పెండింగ్ అంశాలను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కారమైతే దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియ నుంచి ఉపశమనం లభించడంతో పాటు సమయం, ధనం రెండూ ఆదా అవుతాయని పేర్కొన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివాదాలను సామరస్యపూర్వకంగా ముగించేందుకు ఇది మంచి అవకాశమని చెప్పారు. ప్రజలు తమ కేసులకు సంబంధించిన వివరాలను సంబంధిత కోర్టులు, న్యాయవాదులు లేదా పోలీసు అధికారులను సంప్రదించి లోక్ అదాలత్‌లో పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పరస్పర అవగాహనతో తమ వివాదాలను ముగించుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు. "సామరస్య పరిష్కారమే శాశ్వత పరిష్కారం" అని ఆమె పేర్కొన్నారు.

# నేడు బీజేపీ కీలక సమావేశాలు

**హైదరాబాద్ జూన్ 7 సాక్ష్యం;**
తెలంగాణ బీజేపీ కీలక సమావేశాలు నేడు జరగనున్నాయి. పార్టీ కార్యవర్గ సభ్యులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా ఈ సమావేశానికి హాజరు కానున్నారు. రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలపై ప్రధానంగా చర్చించనున్నారు. అలాగే ప్రభుత్వ వైఫల్యాలపై ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై కూడా చర్చించనున్నారు. అలాగే నేడు బీజేపీ అనుబంధ విభాగాలతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు భేటీ కానున్నారు. అనుబంధ విభాగాలు మరింత బలోపేతం చేయడంపై చర్చించనున్నారు. ఈరోజు సాయంత్రం బీజేపీ ప్రజాప్రతినిధుల సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్ హాజరుకానున్నారు.



# తెలంగాణ ప్రజలకు పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలి
### ● లేకుంటే తెలంగాణలో అడ్డుకుంటాం ● తెలంగాణ రక్షణ సేన కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా సంజీవరావు



**కోదాడ జూన్ 07, (సాక్ష్యం)**
తెలంగాణపై చేసిన వ్యా ఖ్యలకు జన సేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే తెలంగాణలో ఆయన పర్యటనలను అడ్డుకుంటామని తెలంగాణ రక్షణ సేన కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా సంజీవరావు హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ త్యాగాల గడ్డ అని,ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అనేక మంది ఉద్యమకారులు రక్తం చిందించిన నేల అని పేర్కొన్నారు. అలాంటి తెలంగాణను అవమానించే విధంగా పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు ఉన్నాయ ని విమర్శించారు. భారత రాజ్యాంగం ప్రకారం ఎవరైనా దేశంలో ఎక్కడైనా ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉందని, దానిని తాము వ్యతిరేకించడం లేదన్నారు. అయితే తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలను మాత్రం సహించబోమని స్పష్టం చేశారు. తెలంగాణ మహిళలపై సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్న వారిని పవన్ కళ్యాణ్ నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిందిపోయి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తెలంగాణ సమాజానికి వెంటనే క్షమాపణ చెప్పకపోతే రాష్ట్రవ్యా ప్తంగా నిరసనలు చేపట్టి పవన్ కళ్యాణ్ పర్యటనలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యల్లేశ్వరరావు, ఉపేందర్ పాల్గొన్నారు.

# రి కేవైసీ తప్పనిసరిగా చేయించు కోవాలి
### టీజీబీ మేనేజర్ భూక్య హుస్సేన్ నాయక్



**రాయపర్తి, జూన్ 7(సాక్ష్యం):**
రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు ప్రతి ఖాతాదారుడూ రి కేవైసీ తప్పనిసరిగా చేయించు కోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రాయపర్తి మేనేజర్ భూక్య హుస్సేన్ నాయక్ తెలిపారు. ఆదివారం రాయపర్తి మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడూ రి కేవైసీ తప్పనిసరిగా చేయించు కోవాలని ఇది పూర్తి కాకపోతే ఖాతాదారుని అకౌంట్ స్తంభించి పోతుందని టీజీబీ మేనేజర్ భూక్య హుస్సేన్ నాయక్ అన్నారు. నగదు విత్‌డ్రా, డిపాజిట్, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్, పింఛన్, రైతు భరోసా డబ్బులు, ఏవీ ఖాతాలో జమ కాకుండా ఉంటాయని హెచ్చరించారు. ఖాతాదారులు ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఫొటో, అడ్రస్ ప్రూఫ్‌తో నేరుగా బ్యాంకుకు రావాలని రి కేవైసీచేసుకునే అవకాశం ఉందని మేనేజర్ అన్నారు.బ్యాంకు కు రాని వారు బ్యాంకు మిత్రను కలిసి ఉచితంగా రి కేవైసీ పూర్తి చేసుకోవచ్చని మేనేజర్ సూచించారు. పింఛన్‌దారులు, రైతులు, మహిళలు ముఖ్యంగా గమనించాలని కోరారు. రి కేవైసీ లేకపోతే ప్రభుత్వ డబ్బులు ఆగిపోతాయి. చివరి రోజు వరకు ఆగకుండా ఈ రెండు రోజుల్లోనే పూర్తి చేసుకోవాలని భూక్య హుస్సేన్ నాయక్ కోరారు. బ్యాంకు పని వేళల్లో సిబ్బంది పూర్తి సహకారం అందిస్తారని ఆయన తెలిపారు.

# చేనేత వస్త్రాలను చాటి చెప్పడం సంతోషకరం
### హైటెక్ సిటీ ఎగ్జిబిషన్‌కు యాదగిరిగుట్ట పాలకవర్గం




**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్..**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైటెక్ సిటీలో ఏర్పాటుచేసిన మన యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్కు ఆదివారం రోజున యాదగిరిగుట్ట పురపాలక సంఘం పాలకవర్గం బృందం వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ గుండ్ల పల్లి వాణి భరత్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత వస్త్రాల ప్రాధాన్యతను, గొప్పతనాన్ని తెలియజేయడం కోసం ముఖ్యంగా చేనేత కార్మికులకు చేయూతను అందించడం కోసం హైటెక్ సిటీలో హైటెక్ కంప్లెక్స్ లో గత మూడు రోజులుగా ఏర్పాటుచేసిన చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్కు చాలా సంతోషకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ, జిల్లా కలెక్టర్ ఆహ్వానం మేరకు యాదగిరిగుట్ట పురపాలక పాలకవర్గ బృందం కలిసి వెళ్లడం జరిగిందని అన్నారు. యంత్రాల మీద తయారుచేసే వస్త్రాల కన్నా చేనేత కార్మికులు తయారుచేసిన వస్త్రాలు ఎంతో రంగు రంగులుగా ఎంతో ఆకర్షణీయంగా, నాణ్యతగా ఉన్నాయని అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బరిగే రమ్య రామచందర్, కౌన్సిలరులు బోడ రాధా సురేష్ , కాటబత్తిని స్వప్న ఆంజనేయులు, బిట్టు సరోజ హరీష్, కర్రె మాధవి ప్రవీణ్, పెలమెల్లి లావణ్య శ్రీధర్, సాదునేని ధనలక్ష్మి మధుకర్, బూడిద మధు, పేరబోయిన సత్యనారాయణ, బబ్బురి శ్రీధర్, కోఆప్షన్ సభ్యులు బండి జంగమ్మ శ్రీశైలం, గౌలికర్ అరుణ రాజేష్, ఎండి రైమా సలాం, ఎస్. కె ఉస్మాన్ షరీఫ్ తదితరులు ఉన్నారు.

## రోడ్ల మంత్రి కోమటిరెడ్డిని కలిసిన
# బిఆర్ఎస్ మండల నాయకులు సైదులు ముదిరాజ్

**మాడుగులపల్లి జూన్ 7 సాక్ష్యం;**
బీఆర్ఎస్ నాయకుడు సైదులు ముదిరాజ్ ఆదివారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిసి తమ ప్రాంతానికి సంబంధించిన పలు ప్రజా సమస్యలను విన్నవించారు. గ్రామ నలుమూలల రోడ్ల పరిస్థితిని మంత్రికి వివరించారు.స్థానిక ప్రాంతాల అభివృద్ధి మరియు గ్రామీణ సమస్యల పరిస్కారం వివరించారు. మండల పరిధిలోని దెబ్బతిన్న అంతర్గత రోడ్ల పునరుద్ధరణ, కొత్తగా బీటీ రోడ్ల నిర్మాణాల మంజూరు చేయాలని గ్రామీణ ప్రాంతాలలో డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు మరియు ఇతర ప్రాథమిక వసతుల కల్పన సమస్యలు తెలిపారు. మండల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లడం. నాయకులు సమర్పించిన వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి, సమస్యల తీవ్రతను బట్టి వాటిని పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.





# తీపి కబుర్లకు లొంగిపోతే జేబులు ఖాళీ
### ఇందుకు వీళ్లే ఉదాహరణ




**హైదరాబాద్ జూన్ 7 సాక్ష్యం;**
సోషల్ మీడియాలో పేమస్ అయిన వాళ్లను నమ్మకండి. వారి మాయ మాటల్లో పడకండి. మోసం చేస్తారు. మీ నుంచి డబ్బులు కాజేస్తారు. అందరూ కాకపోయినా...ప్రస్తుతం నందూస్ వరల్డ్ పేరుతో యూట్యూబ్ లో ఫేమస్ అయిన ఈ జంట అనేక మందిని మోసం చేసి లక్షల రూపాయలు కొల్లగొట్టారు. వీరిపై హైదరాబాద్ తో పాటు పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. చివరకు ఈ జంటపై లుక్ అవుట్ నోటీసులను పోలీసులు జారీ చేశారు. యూట్యూబ్ లో ఫేమస్ అయిన జంట యువతను లక్ష్యంగా చేసుకుని మోసం చేయడం పై వీరిపై అనేక కేసులు నమోదవుతున్నాయి.యూట్యూబ్ లో ఫేమస్ అయి... యూట్యూబ్ లో నందూస్ వరల్డ్ ఫేమస్ అయింది. ప్రధానంగా ఒక ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా వ్యూస్ కూడా బాగా రావడంతో ఈ జంట పాపులర్ అయింది. నిర్వాహకులు రమానందన, ఆమె భర్త జాగర్లమూడి మధుకర్ లపై యూకే ఉద్యోగాలు, వీసాల పేరిట కోట్లాది రూపాయల మోసానికి పాల్పడ్డారన్న ఫిర్యాదులు అందాయి. బాధితుల ఫిర్యాదుల మేరకు వీరిపై ప్రస్తుతం పోలీసులు కేసులు నమోదు చేశారు. యూకేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, వీసాలు మరియు వీసా రెన్యువల్స్ చేయిస్తామని నమ్మించి నిరుద్యోగుల నుంచి భారీ వసూళ్లకు పాల్పడ్డారు. సోషల్ మీడియాలో తమకున్న సెలబ్రిటీ ఇమేజ్‌ను వాడుకుని, ఒక్కొక్కరి నుంచి దాదాపు ఇరవై లక్షల వరకు వసూలు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. రమానందన ఇటీవల సంక్రాంతికి విడుదలయిన ఒక మూవీలోనూ నటించారుఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ జంటపై కేసులు నమోదయ్యాయి. లక్షల్లో మోసం చేసి తిరిగి ఇవ్వమని అడిగితే తమను బెదిరిస్తున్నారంటూ బాధితులు ఫిర్యాదులు చేస్తున్నారు. అయితే నందూ కుటుంబం మాత్రం తాము ఎవరినీ మోసం చేయలేదని చెబుతుంది. తమ పేరుతో కంపెనీలు ఏర్పాటు చేసి ఎవరో చేసిన మోసం తమపై వేశారంటూ రమానందన వివరణ ఇచ్చారు. అయితే ఇప్పటికే నందూస్ వరల్డ్ జంటపై కేసులు నమోదవ్వడం, మీడియాలో పెద్దయెత్తున ప్రచారం జరుగుతుండటంతో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. తాము మోసపోయామంటూ ఫిర్యాదులు చేస్తున్నారు. గుంటూరుకు చెందిన జాగర్లమూడి మధుకర్, అన్నే రమానందన దంపతులు ప్రస్తుతం లండన్ లో స్థిరపడ్డారు.

# నేడు పశ్చిమ గోదావరి జిల్లాకు చంద్రబాబు



**అమరావతి జూన్ 7 సాక్ష్యం;**
నేడు పశ్చిమ గోదావరి జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించనున్నారు. సిద్ధాంతంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. అనంతరం రైతులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం కానున్నారు. ఆరు నెలల్లో 26.46 లక్షల పాస్ పుస్తకాలు రైతులకు అందజేశారు. గత ప్రభుత్వం జారీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాల్లోని తప్పులను సరిదిద్దుతూ ప్రజా ప్రభుత్వం రైతులకు కొత్త పుస్తకాలను అందిస్తోంది. రైతుల సమక్షంలోనే రీ సర్వే చేసి వారి ఆమోదంతో పాస్ పుస్తకాలను ఇస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతీ నెలా మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో భాగంగా నేరుగా ఆయనే రైతులతో సమావేశమై వారి సమక్షంలోనే అధికారులతో భూమి వివరాలను చదివించి పుస్తకాలను అందజేస్తున్నారు.రైతులకు **పట్టాదారు పాస్ పుస్తకాలు..**
సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం సిద్ధాంతంలో మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్నారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ అనంతరం వారితో ప్రత్యేకంగా భేటీ అవుతారు. జనవరి నుంచి ప్రభుత్వం రీ సర్వే నిర్వహించి పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తోంది. ఇప్పటి వరకు 6,688 గ్రామాల్లో రీ-సర్వే నిర్వహించింది. అందులో 6,459 గ్రామాలకు చెందిన 26.46 లక్షల మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం అందించింది. వచ్చే 9 నెలల్లో మరో 10,357 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం విధించారు. ఈ గ్రామాలకు సంబంధించి మొత్తం 67.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు ప్రభుత్వం పంపిణీ చేయనుంది.

### బంగాళాఖాతంలో

# అల్పపీడనం.. తెలంగాణలో వర్షాలు



**హైదరాబాద్, జూన్ 07 సాక్ష్యం;**
ఎండ తీవ్రతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ తీపి కబురు అందించింది. నైరుతి రుతుపవనాలు జూన్ 10 లేదా అంతకంటే ముందే తెలంగాణను తాకనున్నాయి. ప్రస్తుతం ఇవి అనుకూల వాతావరణ పరిస్థితుల మధ్య వేగంగా ముందుకు సాగుతున్నాయి. రుతుపవనాల రాకకు ముందే ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రానున్న రెండ్రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం కొంత తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, స్థానిక పరిస్థితులు వర్షాలకు అనుకూలంగా మారాయని అంటున్నారు. తీవ్ర ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. రైతులు ఆశగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఈ నెల 10న లేదా అంతకన్నా ముందే తెలంగాణను తాకే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. ప్రస్తుతం ఇవి అరేబియా సముద్రం, బంగాళాఖాతం రెండు చోట్లా అనుకూల వాతావరణ పరిస్థితుల మధ్య వేగంగా ముందుకు సాగుతున్నాయన్నారు. మరో రెండు రోజుల్లో ఇవి తెలంగాణలోకి ప్రవేశించనున్నాయని వాతావరణశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా జూన్ ఒకటే తేదీనే వచ్చే నైరుతి రుతుపవనాలు.. ఈసారి కాస్త ఆలస్యంగా జూన్ 4 కేరళాని తాకాయి. ఈ రుతుపవనాలు ఇప్పటికే కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను తాకాయి. అక్కడ ముందస్తుగా మంచి వర్షాలు కురిశాయి. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం కారణంగా రుతుపవనాల రాక ఆలస్యం కావచ్చునని, అలాగే సీజనల్ వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ గతంలోనే అంచనా వేసింది. అయితే ప్రస్తుత స్థానిక వాతావరణ పరిస్థితులు, బంగాళాఖాతంలో మారుతున్న సమీకరణాలు వర్షాలను మరింత బలపరుస్తున్నాయని నిపుణులు చెప్తున్నారు. రుతుపవనాల రాకకు ముందే రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం చల్లబడనుంది. వాతావరణంలో ఏర్పడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. గాలివేగం గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల కొన్ని చోట్ల 60 కి.మీ వేగంతో వీస్తూ ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందన్నారు. నేడు కుమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణ పేట, జోగులాంబ గద్వాల్ జిల్లాలలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేశారు. బంగాళాఖాతం నైరుతి, పశ్చిమ మధ్య భాగాల్లో నైరుతి గాలులు మరింతగా విస్తరిస్తున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. దీనివల్ల ఉపరితల ఆవర్తనాలు తీవ్రమై అల్పపీడనం ఏర్పడే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. వీటి ప్రభావంతో రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. రైతులు ముందస్తు వ్యవసాయ పనులకు సిద్ధం కావచ్చునని.. అయితే ఉరుములు పడే సమయంలో ప్రజలు చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద ఉండరాదని అధికారులు హెచ్చరించారు.

### మీ ఆర్భాటాలు

# పక్కనపెట్టి మా ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి

పవన్ కళ్యాణ్‌పై రాహుల్ రామకృష్ణ ట్వీట్

**హైదరాబాద్, జూన్ 07 సాక్ష్యం;**
సినీ నటుడు రాహుల్ రామకృష్ణ చేసిన ట్వీట్ తీవ్ర వివాదాస్పదంగా మారింది. పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి ట్వీట్ చేసిన రాహుల్ రామకృష్ణ.. గ్రామ సభ చట్టం అమలుకు సంబంధించిన ఫలితాలు చూపించాలని పేర్కొన్నారు. అడవులకు సంబంధించిన కార్యక్రమాలకు సంబంధించి కొన్ని అనుమానాస్పద లెక్కలు ఉన్నాయని.. వాటి గురించి చెప్పాలని అడిగారు. చివర్లో జై తెలంగాణ అంటూ పేర్కొనడం గమనార్హం. నటుడు రాహుల్ రామకృష్ణ సినిమాల్లో చేసే కామెడీతోపాటు.. సోషల్ మీడియాలో చేసే కామెంట్లతో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూనే ఉన్నారు. ఒకానొక సమయంలో సోషల్ మీడియా నుంచి వెళ్లిపోతున్నట్లు ప్రకటించిన రాహుల్ రామకృష్ణ.. ఆ తర్వాత అడపాదడపా తన పోస్టులతో వైరల్‌గా మారుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా జనసేన అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి చేసిన ట్వీట్ నెట్టింట వైరల్‌గా మారింది. ఈ క్రమంలోనే ట్వీట్ చేసిన రాహుల్ రామకృష్ణ.. ' పవన్ కళ్యాణ్ .. పెసా 1/70 చట్టం (ది పంచాయతీస్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్ ఏరియాస్ యాక్ట్), గ్రామ సభ చట్టం అమలుకు సంబంధించిన ఫలితాలను దయచేసి అడిగి చూపించండి అంటూ ప్రశ్నించారు. అటవీ విస్తరణ కార్యక్రమాలు మీరు చేశారా అని అడిగారు. ఒక స్వతంత్ర సంస్థ వెల్లడించిన లెక్కల ప్రకారం.. గణాంకాలు అనుమానాస్పదంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆ లెక్కల కోసం తాను దాఖలు చేసి.. వాటి ద్వారా వచ్చిన ఫలితాలను అడుగుతున్నట్లు చెప్పారు. చివర్లో జై తెలంగాణ అంటూ ట్వీట్ చేశారు. ఆ తర్వాత మరో ట్వీట్ చేసిన రాహుల్ రామకృష్ణ.. వీటితోపాటు మీరు సాధారణంగా చేసే ఆర్భాటాలు పక్కన పెడితే.. పవన్ కళ్యాణ్ నిర్వహించే ప్రతీ పదవిలోని ప్రతీ విభాగంలో సమాచార హక్కు చట్టంలోని క్రియాశీల సమాచారాన్ని బహిర్గతం చేయడానికి సంబంధించిన సెక్షన్ 4.1(బి)ని అమలు చేశారా అని ప్రశ్నించారు. తాను పవన్ కళ్యాణ్ అభిమానిని కాబట్టే అడుగుతున్నానని.. తాము అడిగే ప్రశ్నలకు నిరంతరం సమాధానం ఇవ్వాలని పవన్ కళ్యాణ్‌కు సూచించారు. ఇక ఇటీవల జూన్ 2వ తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ .. హైదరాబాద్‌లో తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ పెట్టేందుకు ప్రయత్నించగా.. తెలంగాణ పోలీసులు అనుమతించకపోవడంతో.. పవన్ కళ్యాణ్.. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ప్రెస్‌మీట్ నిర్వహించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి.. తెలంగాణలోని అన్ని పార్టీల నేతలు తీవ్ర విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. వాటికి జనసేన పార్టీ నేతలు కౌంటర్లు వేస్తూనే ఉన్నారు. దీంతో ఈ వ్యవహారం తీవ్ర దుమారం రేపుతున్న వేళ.. తాజాగా రాహుల్ రామకృష్ణ చేసిన వ్యాఖ్యలు మరింత వివాదానికి దారి తీస్తున్నాయి.



# ఘనంగా మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు

## పలు చోట్ల సేవా కార్యక్రమాలతో వేడుకలు

**హైదరాబాద్, జూన్ 07 సాక్ష్యం;**
తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు మామిడి సోమయ్య 60వ జన్మదిన వేడుకలు ఆదివారం పలు చోట్ల ఘనంగా జరిగాయి. వివిధ జిల్లాలలో ఫెడరేషన్ నాయకులు కేక్ కట్ చేసి, పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. పేదలు, అనాధలకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. మొక్కలు నాటారు.

**హైదరాబాద్‌లో ఘనంగా వేడుకలు**
జర్నలిస్టు ఉద్యమ నేత మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు హైదరాబాద్ లో ఘనంగా జరిగాయి. వనస్థలిపురంలోని శాంతినికేతన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక వికలాంగుల సంస్థలో ఆయన



స్వయంగా వెళ్ళి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వహకులు బాలేశ్వర్, జర్నలిస్టులు యర్రమిల్లి రామారావు, అశోక్ కుమార్ గౌడ్, పర్వతాలు, సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ, ఏవీఎన్ టీవీ కార్యాలయంలో సిబ్బంది సోమయ్య చే కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది ఆయనను శాలువాతో సన్మానించారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అశోక్ కుమార్ గౌడ్, ఎల్బీనగర్ నియోజకవర్గం కోశాధికారి నంబి ప్రసాద్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు వైజీఎస్ రామారావు తదితరులు మామిడి సోమయ్య కు శాలువా కప్పి పూల బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడబ్ల్యూజేఎఫ్ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లిబర్టీలోని కార్యాలయంలో మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు జరిపారు. ఈ వేడుకల్లో పాల్గొన్న సోమయ్యతో కేట్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అడ్ హక్ కమిటీ కన్వీనర్ రవి కుమార్, కో-కన్వీనర్లు శ్రీనివాస్ గౌడ్,ఎస్ 9 రవికుమార్, సంతోష్ కుమార్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు సోమయ్య కు శాలువాలు, బొకేలతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



**ఖమ్మంలో..**
ఖమ్మంలో జర్నలిస్టు నేత మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అన్నం ఫౌండేషన్ అనాధల ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపారు. అనంతరం కుసుమ గార్డెన్స్ లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్ తదితరులు పాల్గొన్నారు.



**సూర్యాపేటలో..**
సూర్యాపేటలో మామిడి సోమయ్య 60వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చి జన్మదిన వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పాల్వాయి జానయ్య, నందిపాటి సైదులు పాల్గొన్నారు.

**కరీంనగర్ జిల్లాలో..**
కరీంనగర్ జిల్లాలో జమ్మికుంటలో మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పంతాటి రవీందర్ ఆధ్వర్యంలో స్థానిక శివాలయం బొమ్మల గుడి వద్ద భక్తులకు, పేదలకు అన్నదానం చేశారు.

**మంచిర్యాలలో..**
టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపకులు మామిడి సోమయ్య 60వ జన్మదిన వేడుకలు మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీసీలోని శ్రీసాయి



వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మిట్టపల్లి మధు, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యా గౌడ్ ,జాతీయ కౌన్సిల్ సభ్యులు శానగొండ శ్రీనాథ్, సభ్యులు సతీష్ నౌండ్ల సతీష్ ,ప్రవీణ్ కుమార్ ,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఆసీఫాబాద్ జిల్లాలో..**
కొమురం భీమ్ ఆసీఫాబాద్ జిల్లాలో జర్నలిస్ట్ నేత మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు జరిపారు. టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా




కమిటీ ఆధ్వర్యంలో కాగజ్ నగర్ లో కేక్ కట్ చేస వేడుకలు జరిపారు. జిల్లా అధ్యక్షుడు వద్నాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


**వరంగల్ జిల్లాలో..**
తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, సీనియర్ పాత్రికేయులు మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు వరంగల్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచం మైదాన్ లేబర్ అడ్డాలో పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జక్కుల విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బొట్ల స్వామిదాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ పాలడుగుల సురేందర్, ఉపాధ్యక్షుడు వెల్డి రాజేందర్, సహాయ కార్యదర్శి రాంపల్లి శ్రీనివాసచారి, సభ్యుడు పెండేల శీను, అశోక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### 'బత్తిని చేప ప్రసాదం' కథేంటి..?

# ఆస్తమాకు ఇది నిజంగా దివ్యౌషధమా?

**హైదరాబాద్, జూన్ 07 సాక్ష్యం;**
హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 'బత్తిని చేప ప్రసాదం' పంపిణీ నేటి రాత్రి 9 గంటలకు ప్రారంభం కానుంది. ఆస్తమా రోగులకు రేపు రాత్రి వరకు విరామం లేకుండా చేప ప్రసాదం పంపిణీ కొనసాగనుంది. దాదాపు 176 ఏళ్లుగా బత్తిని కుటుంబం ఈ సాంప్రదాయాన్ని ఉచితంగా కొనసాగిస్తోంది. బతికున్న కొర్రమీను చేప పిల్ల నోట్లో ఆయుర్వేద మూలికను ఉంచి మింగించటం దీని ప్రత్యేకత. ఈ ప్రసాదంపై సైన్స్, హేతువాదులు సంస్థల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నప్పటికీ తరాలుగా వస్తున్న నమ్మకంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఆస్తమా బాధితులు నగరానికి చేరుకొని ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. ప్రతి ఏటా మృగశిర కార్తె వచ్చిందంటే చాలు దేశం నలుమూలల నుంచి ఆస్తమా, శ్వాసకోశ వ్యాధిగ్రస్తులు హైదరాబాద్ చేరుకుంటారు. పాతబస్తీకి చెందిన బత్తిని కుటుంబం అందించే 'చేప ప్రసాదం' కోసం వేచిచూస్తుంటారు. వైద్య విజ్ఞానం ఎంత పురోగమించినా.. కొన్ని వందల ఏళ్లుగా జనంలో పాతుకుపోయిన అచంచల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోంది బత్తిని చేప ప్రసాదం . మృగశిర కార్తె సందర్భంగా ఇవాళ రాత్రి 9 గంటల నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ ప్రసాదం పంపిణీ ప్రారంభం కానుంది. రేపు రాత్రి వరకు ఎలాంటి విరామం లేకుండా ఈ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుంది.

**బత్తిని చేప ప్రసాదం వెనుక 176 ఏళ్ల హిస్టరీ**
బత్తిని చేప ప్రసాదానికి సుమారు 176 సంవత్సరాల చరిత్ర ఉంది. నిజాంల కాలంలో హైదరాబాద్‌కు చెందిన బత్తిని వీరన్న గౌడ్ అనే వ్యక్తికి ఒక సాధువు ఈ రహస్య వనమూలికా ఫార్ములాను ప్రసాదించారని చారిత్రక కథనం.



మృగశిర కార్తె రోజున ఎలాంటి లాభాపేక్ష లేకుండా.. ఉచితంగా, నిస్వార్థంగా ప్రజలకు ఈ ఔషధాన్ని పంపిణీ చేయాలనే కఠినమైన నిబంధనతో ఆ సాధువు దీనిని బత్తిని కుటుంబానికి అప్పగించారు. అప్పటి నుంచి వారి వంశస్థులు ఐదు తరాలుగా ఈ సాంప్రదాయాన్ని పవిత్రంగా కొనసాగిస్తూ వస్తున్నారు. మొదట్లో పాతబస్తీలోని వారి నివాసంలో చిన్నగా ప్రారంభమైన ఈ కార్యక్రమం.. కాలక్రమేణా లక్షలాది మంది తరలిరావడంతో ప్రభుత్వం చొరవ తీసుకుని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు మార్చింది.

**ఈ చేప ప్రసాదం ఎలా పనిచేస్తుంది?**
ఒక చిన్న బతికున్న కొరమీను చేప పిల్ల నోట్లో పసుపు రంగులో ఉండే వనమూలికల ముద్దను ఉంచుతారు. ఆ చేపను రోగి చేత బతికుండగానే మింగిస్తారు. శాకాహారుల కోసం ఈ ముద్దను బెల్లంతో కలిపి ఇస్తారు. ఆయుర్వేద నిపుణులు, నిర్వాహకుల నమ్మకం ప్రకారం.. మృగశిర కార్తె అనేది వాతావరణం మారే సంధికాలం. ఈ సమయంలో శ్వాసకోశ ఇబ్బందులు ఎక్కువవుతాయి. బతికున్న చేప పిల్ల గొంతు గుండా లోపలికి వెళ్లేటప్పుడు.. అది తన తోకను, రెక్కలను ఆడిస్తూ వెళ్తుంది. ఈ ప్రక్రియ వల్ల శ్వాసనాళాల్లో పేరుకుపోయిన కఫం, జిగట వెళ్లిపోతుందని ఆ తర్వాత వనమూలికల ముద్ద శ్వాసకోశ కండరాలను ఉత్తేజపరిచి సమస్యలను నివారిస్తుందని నమ్ముతారు. వరుసగా మూడు సంవత్సరాల పాటు ఈ ప్రసాదం తీసుకుంటే ఆస్తమా పూర్తిగా తగ్గుతుందని చెబుతారు.

**నిజంగా దివ్యౌషధమా?**
మెడికల్ సైన్స్, జన విజ్ఞాన వేదిక లాంటి హేతువాద సంఘాలు ఈ చేప ప్రసాదాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ గతంలో కోర్టులను ఆశ్రయించాయి. దీనిపై సైన్స్ పరంగా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. న్యాయస్థానాల ఆదేశాల ప్రకారం, దీనికి ఎలాంటి క్లినికల్ నిరూపణలు లేనందున అధికారికంగా మందు అని పిలవడానికి వీల్లేదు. అందుకే దీనిని చేప ప్రసాదంగా మార్చారు. ఈ వనమూలికల ముద్దను ల్యాబొరేటరీలలో పరీక్షించగా.. అందులో ఎలాంటి హానికరమైన స్టెరాయిడ్స్ గానీ, కెమికల్స్ గానీ లేవని తేలింది. ఇందులో కేవలం సాధారణ పసుపు, ఇంగువ, కర్పూరం వంటి సాంప్రదాయ పదార్థాలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. సైన్స్ దీనిని కేవలం ఒక నమ్మకంగా కొట్టిపారేసినప్పటికీ.. గత కొన్ని తరాలుగా ఈ ప్రసాదం ద్వారా ఉపశమనం పొందామని చెప్పే బాధితుల అనుభవాలే ఏటా లక్షలాది మందిని హైదరాబాద్‌కు రప్పిస్తున్నాయి. చేప ప్రసాదం కోసం ఇప్పటికే పలు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు, బాధితులు హైదరాబాద్ నగరానికి చేరుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికోసం అధికారులు నాంపల్లికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో తాగునీరు, క్యూ లైన్లు, భద్రత, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది.

# హైదరాబాద్ కో లివింగ్ హాస్టల్‌లో దారుణం

## ప్రియుడి వేధింపులు తట్టుకోలేక ప్రియురాలు ఆత్మహత్య

**హైదరాబాద్, జూన్ 07 సాక్ష్యం;**
ప్రియుడి వేధింపులు తట్టుకోలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. గత కొంతకాలంగా వారిద్దరూ కలిసి హైదరాబాద్‌లోని కో లివింగ్ హాస్టల్‌లో ఉంటున్నారు. అయితే ఇటీవల వారిద్దరి మధ్య విబేధాలు పెరిగాయి. దీంతో ప్రియుడి వేధింపులు ఆమె తట్టుకోలేకపోయింది. ఈ క్రమంలోనే కో లివింగ్ హాస్టల్‌లోనే బిల్డింగ్ పైనుంచి దూకి.. ఆ యువతి ప్రాణాలు తీసుకుంది. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు. హైదరాబాద్ నగరంలో కో లివింగ్ కల్చర్ పెరిగిపోతోంది. గత కొంతకాలంగా యువతీ యువకులు ఒకే హాస్టల్‌లో ఒకే రూంలో కలిసే ఉంటున్నారు. ఉద్యోగాలు చేసేవారు, కాలేజీల్లో చదువుకునే వారు కో లివింగ్ హాస్టల్‌లలో జీవిస్తున్నారు. హైదరాబాద్‌కు వచ్చి ఇళ్లల్లో తెలియకుండా ఆడ, మగ కలిసి ఉంటున్నారు. అయితే ఈ కో లివింగ్ హాస్టల్‌ల వద్ద ఉండే ఫ్యామిలీలు.. యువతీయువకుల తీరు పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ కో లివింగ్ హాస్టల్‌లపై అనేక ఫిర్యాదులు కూడా వచ్చాయి. ఈ క్రమంలోనే తాజాగా కో లివింగ్ హాస్టల్‌లో తీవ్ర విషాదం నెలకొంది. యువకుడి వేధింపులు తట్టుకోలేని ఓ యువతి.. బలవన్మరణానికి పాల్పడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గచ్చిబౌలి ఐటీ కారిడార్‌లో ఉన్న ఎలైట్ కో లివింగ్ హాస్టల్‌లో సాయి కుమార్, దుర్గ కలిసి ఉంటున్నారు. సాయికుమార్ గొడవల కారణంగా అతని వేధింపులు భరించలేక దుర్గ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. నానక్‌రామ్‌గూడలో జాబ్ చేస్తున్న దుర్గ.. సాయి కుమార్‌తో లివ్ ఇన్ రిలేషన్ షిప్‌లో ఉంది. అయితే దుర్గపై అనుమానం పెంచుకున్న సాయికుమార్.. ఆమెతో తీవ్ర వాగ్వాదానికి దిగడంతో.. ఆమె వాటిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. సాయికుమార్ తనను.. మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేయడంతో తట్టుకోలేకపోయిన దుర్గ.. ఇలా ఎందుకు చేస్తున్నావని అతడిని నిలదీసింది. దీంతో వారిద్దరి మధ్య తీవ్ర గొడవ మొదలైంది. ఈ క్రమంలోనే వారిద్దరూ కలిసి కో లివింగ్ హాస్టల్ టెర్రస్‌పైకి వెళ్లినట్లు సీసీటీవీ ఫుటేజీలో రికార్డ్ అయింది. ఆ తర్వాత పై నుంచి సాయికుమార్ ఒక్కడే తిరిగి కిందికి వచ్చిన దృశ్యాలు రికార్డ్ అయ్యాయి. అయితే ఆ వెంటనే 5 అంతస్తుల పైనుంచి దుర్గ కిందికి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ వ్యవహారంపై కో లివింగ్ హాస్టల్ యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇచ్చింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకోగా.. అప్పటికే దుర్గ చనిపోయింది. ఈ క్రమంలోనే దుర్గ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దుర్గ మామ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సాయికుమార్‌పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు. సాయికుమార్ వేధింపులే దుర్గ ఆత్మహత్యకు కారణమని ఫిర్యాదులో పేర్కొన్నారు.





# అఫ్ఘానిస్థాన్‌కు ఫాలోఆన్ గండం..!

## 113 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన అఫ్ఘాన్

## 564 రన్స్ వద్ద భారత్ తొలి ఇన్నింగ్స్ డిక్లేర్..!

ముల్లాన్‌పూర్ టెస్టులో అఫ్ఘానిస్థాన్‌పై టీమిండియా పూర్తి పట్టు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌ను 564/8 పరుగుల వద్ద డిక్లేర్ చేసిన భారత్.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి అఫ్ఘానిస్థాన్‌ను 113/5 పరుగులకే కట్టడి చేసింది. అఫ్ఘాన్ జట్టు ఇంకా 451 పరుగులు వెనకబడి ఉంది. భారత బౌలర్లలో డెబ్యూ స్పిన్నర్ మానవ్ సుతార్ 3 వికెట్లు, ప్రసిద్ధ్ కృష్ణ 2 వికెట్లతో అఫ్ఘాన్ నడ్డి విరిచారు. అఫ్ఘాన్‌ను భారత్ తక్కువ స్కోరుకే ఆలౌట్ చేసి, ఫాలో ఆన్ ఆడించే అవకాశం ఉంది.ముల్లాన్‌పూర్‌లో అఫ్ఘానిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచులో టీమిండియా పట్టుబిగిస్తోంది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్.. 564/8 వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం రెండోరోజు ఆట ముగిసే సమయానికే అఫ్ఘానిస్థాన్ ఐదుగురు బ్యాటర్లను పెవిలియన్ పంపింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి అఫ్ఘాన్.. 113/5 పరుగులతో నిలిచింది. ప్రస్తుతం ఆ జట్టు ఇంకా 451 పరుగులు వెనకబడి ఉంది.ఓవర్ నైట్ స్కోరు 368/3తో రెండో రోజు ఆట ప్రారంభించిన భారత్.. భారీ స్కోరు చేసింది. 500 రన్స్ చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేస్తుందని అంతా భావించారు. కానీ కెప్టెన్ గిల్ మాత్రం ఆ నిర్ణయం తీసుకోలేదు. మళ్లీ బ్యాటింగ్ చేసే అవకాశం



రాకూడదనే లక్ష్యంతో అతడు.. ఇన్నింగ్స్‌ను పొడిగించాడు. ఓవర్ నైట్ స్కోరు సెంచరీ, హాఫ్ సెంచరీతో రెండో రోజు ఆట ప్రారంభించిన గిల్ (126), రిషభ్ పంత్ (81) మరికొన్ని పరుగులు జోడించి ఔట్ అయ్యారు. చివర్లో వాషింగ్టన్ సుందర్.. 68 బంతుల్లో 52 పరుగులతో అజేయంగా నిలవడంతో భారత్ స్కోరు 550 పరుగుల మార్కును దాటింది. 564/8 వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అఫ్ఘానిస్థాన్.. వరుసగా వికెట్లు కోల్పోయింది. డెబ్యూ స్పిన్నర్ మానవ్ సుతార్ దెబ్బకు ఆ జట్టు బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. 28 పరుగుల వద్ద అబ్దుల్ మాలిక్‌ను ఔట్ చేసి.. మానవ్ సుతార్.. భారత్‌కు తొలి వికెట్ అందించాడు. ఆ తర్వాత ప్రసిద్ధ్ కృష్ణ కూడా వికెట్ల వేట కొనసాగించాడు. సుతార్ 3, ప్రసిద్ధ్ 2 వికెట్లు తీశారు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికే అఫ్ఘానిస్థాన్ 5 వికెట్లు కోల్పోయింది. ప్రస్తుతం ఆ జట్టు స్కోరు 113/5. ఆ జట్టు ఇంకా తొలి ఇన్నింగ్స్‌లో 451 పరుగులు వెనకబడి ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో అఫ్ఘాన్‌ను భారత్ 200 రన్స్‌లోపే కట్టడి చేస్తే.. ఫాలో ఆన్ ఆడించే అవకాశం ఉంది. అదే జరిగితే ఈ మ్యాచ్‌లో భారత్ రెండోసారి బ్యాటింగ్ చేసే అవకాశం రాకపోవచ్చు.

### ఫ్రెంచ్ ఓపెన్ విజేతగా 19ఏళ్ల ఆండ్రీవా

19ఏళ్ల రష్యన్ టెన్నిస్ స్టార్ మిరా ఆండ్రీవా 2026 ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఛాంపియన్‌గా నిలిచింది. శనివారం పారిస్ వేదికగా జరిగిన ఫైనల్‌లో ఆమె చ్వాలిన్‌స్కా (పోలెండ్) పై ఘన విజయం సాధించింది. ఆండ్రీవా తన ప్రత్యర్థి చ్వానిన్‌స్కాపై 6- 3, 6-2 తేడాతో వరుస సెట్లలో నెగ్గి విజేతగా నిలిచింది. 2014లో మరియా షరపోవా తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ దక్కించుకున్న రష్యాన్ టెన్నిస్ స్టార్‌గా ఆండ్రీవా రికార్డ్ సృష్టించింది.తాజాగా జరిగిన ఫైనల్‌లో ఆండ్రీవా ఆద్యంతం ఆధిత్యం ప్రదర్శించింది. గంటా 22 నిమిషాలు సాగిన ఆటలో తొలి నుంచీ ఆమె దూకుడుగా ఆడింది. దీంతో చ్వాలిన్‌స్కా పాయింట్లు సాధించడంలో ఇబ్బంది పడింది. తొలి సెట్ కోల్పోయిన చ్వాలిన్ రెండో సెట్‌లోనూ మొదట్లో పేలవంగా ఆడి పాయింట్లు ఇచ్చుకుంది. ఒక దశలో 5-0తో రెండో సెట్లో ఆండ్రీవా పూర్తి లీడ్‌లో ఉంది. కానీ కాసేపు చ్వాలిన్‌స్కా పోరాడింది. రెండు పాయింట్లు సాధించింది. దీంతో ఆసక్తి రేగినా పుంజుకున్న ఆండ్రీవా 6-2తో రెండో సెట్‌ను నెగ్గింది. ఇలా ప్రత్యర్థి చ్వాలిన్‌స్కాకు ఎలాంటి ఎవకాశం ఇవ్వకుండా వరుస సెట్లలో ఆండ్రీవా విజయం సాధించింది. దీంతో రెండు సెట్లలోనే మ్యాచ్ ముగిసింది.ప్రస్తుతం ఆండ్రీవా వయసు 19ఏళ్లు. ఈ క్రమంలో మోనికా సెలెస్ తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన అతిపిన్న వయస్కురాలిగా రికార్డు కొట్టింది. 18ఏళ్ల వయసులో మోనికా సెలెస్ 1992 ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను ముద్దాడింది. ఇక ఆండ్రీవాకు కెరీర్‌లో ఇదే మొట్ట మొదటి తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ కావడం విశేషం. ఇక ఈ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన ఆండ్రీవా రూ.21 కోట్ల ప్రైజ్‌మనీ అందుకుంది.మరోవైపు, ఇవాళే పురుష డబుల్స్ ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ టైటిల్ ఫైట్‌లో హెచ్. హెలియోవారా, ఎ. పాటెన్ - వీ. గ్రానోల్లెర్స్, ఎ. జెబల్లోస్ జోడీలు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో గ్రానోల్లెర్స్-జెబల్లోస్ జోడీ విజయం సాధించింది. 6-4, 6-2 తేడాతో ఈ జోడీ నెగ్గి, టైటిల్ పట్టేసింది. ఇక పురుషుల సింగిల్స్ ఫైనల్ ఆదివారం (జూన్ 07) సాయంత్రం జరగనుంది. ఈ మ్యాచ్ లో ఫ్లావియో కోబోలి- అలెగ్జాండర్ జ్వెరెవ్ తలపడనున్నారు.



## టీ20 ప్రీమియర్ లీగ్‌లో 523 పరుగులతో సంచలనం..!

తెలంగాణ టీ20 ప్రీమియర్ లీగ్‌కు సంబంధించి హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఆటగాళ్ల వేలం ఆసక్తికరంగా సాగింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన పలువురు యువ క్రికెటర్లు తమ ప్రతిభతో ఫ్రాంచైజీల దృష్టిని ఆకర్షించగా, అందులో ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన కొడిమెల హిమతేజ ప్రత్యేకంగా నిలిచాడు. ఖమ్మం ఏసెస్ జట్టు హిమతేజను రూ.8 లక్షలకు సొంతం చేసుకుంది. ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న టీజీ 20 ప్రీమియర్ లీగ్‌లో ఆయన ఖమ్మం జట్టు తరఫున బరిలో దిగనున్నాడు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన మధుసూదన్, కామేశ్వరి దంపతుల కుమారుడైన హిమతేజ చిన్నప్పటి నుంచే క్రికెట్‌పై ఆసక్తి చూపించాడు. తొలుత స్థానికంగా గల్లీ క్రికెట్ ఆడుతూ ఆటలో మెలకువలు నేర్చుకున్న ఆయన తర్వాత పాఠశాల స్థాయి పోటీల్లో పాల్గొని తన ప్రతిభను నిరూపించుకున్నాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లోనూ ఆయన మంచి ప్రదర్శన ఇచ్చి అందరి దృష్టిని ఆకర్షించాడు. హిమతేజ ప్రతిభను గుర్తించిన కుటుంబ సభ్యులు ఆయనకు మరింత శిక్షణ అవసరమని భావించి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో నడుస్తున్న క్రికెట్ అకాడమీలో చేర్పించారు. అక్కడ శిక్షణతో పాటు క్రమశిక్షణ, ఆటతీరు, మ్యాచ్ పరిస్థితులను అర్థం చేసుకోవడం వంటి అంశాల్లో మెరుగుపడిన హిమతేజ, క్రమంగా తన ఆటను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాడు. అంచలంచెలుగా ఎదుగుతూ ఇటీవల హైదరాబాద్ రంజీ జట్టులో చోటు సంపాదించడం ఆయన కెరీర్‌లో పెద్ద మైలురాయిగా నిలిచింది. రంజీ జట్టుకు ఎంపికైన తర్వాత హిమతేజ ఇప్పటివరకు ఏడు మ్యాచ్‌లు ఆడి 523 పరుగులు సాధించాడు.



ఇందులో ఒక సెంచరీ, నాలుగు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఈ గణాంకాలే ఆయన స్థిరత్వం, దూకుడుతో పాటు మ్యాచ్‌ను మలుపుతిప్పగల సామర్థ్యాన్ని స్పష్టంగా చూపుతున్నాయి. రంజీ జట్టుకు చేరకముందు కూడా హిమతేజ పలు రాష్ట్ర స్థాయి, ఇతర రాష్ట్రాల్లో నిర్వహించిన టోర్నమెంట్లలో పాల్గొని తన ప్రతిభను ప్రదర్శించాడు. ఈ క్రమంలోనే ఆయనపై ఫ్రాంచైజీల ఆసక్తి పెరిగింది.హైదరాబాద్‌లో జరిగిన వేలంలో మొత్తం ఎనిమిది ఫ్రాంచైజీ జట్లు పాల్గొన్నట్లు సమాచారం. ప్రతిభావంతులైన ఆటగాళ్లను దక్కించుకోవడానికి జట్లు పోటాపోటీగా బిడ్‌లు వేసినట్లు తెలిసింది. ఈ వేలంలో టీమిండియా ఆటగాడు తిలక్ వర్మ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. అయినప్పటికీ ఆదిలాబాద్ యువకుడు హిమతేజను ఖమ్మం ఏసెస్ జట్టు భారీ మొత్తానికి దక్కించుకోవడం విశేషంగా మారింది. ఇక ఈ నెల 21 నుంచి మొదలుకానున్న టీజీ 20 ప్రీమియర్ లీగ్‌పై క్రికెట్ అభిమానుల్లో ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యువ ప్రతిభకు వేదికగా నిలుస్తున్న ఈ టోర్నీ ద్వారా మరికొందరు ఆటగాళ్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. హిమతేజ లాంటి యువ క్రీడాకారులు ఈ వేదికపై రాణిస్తే, తెలంగాణ క్రికెట్ భవిష్యత్తు మరింత ఉజ్వలంగా మారడం ఖాయం.



## నాపై నమ్మకం ఉంచినందుకు బీసీసీఐకి కృతజ్ఞతలు

### శ్రేయస్ అయ్యర్ తొలిసారి స్పందన

టీమిండియా టీ20 జట్టుకు కొత్త కెప్టెన్‌గా నియమితుడైన తర్వాత శ్రేయస్ అయ్యర్ తొలిసారి స్పందించాడు. ప్రస్తుతం ముంబై టీ20 లీగ్‌లో ఆడుతున్న అతడు, దేశానికి నాయకత్వం వహించే అవకాశం రావడం గర్వకారణంగా భావిస్తున్నానని, తనపై నమ్మకం ఉంచిన బీసీసీఐకి కృతజ్ఞతలు తెలిపాడు. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్, కేకేఆర్, పంజాబ్ కింగ్స్ జట్లకు సారథ్యం వహించిన అనుభవమున్న అయ్యర్.. జూన్ నుంచి ప్రారంభం కానున్న ఐర్లాండ్, ఇంగ్లాండ్ సిరీస్‌లతో భారత్ టీ20 కెప్టెన్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించనున్నాడు. టీమిండియా టీ20 జట్టు కొత్త కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ నియమితుడయ్యాడు. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌ల ద్వారా భారత జట్టు సారథిగా అతడి ప్రయాణం కొనసాగనుంది. ఇటీవల పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న సూర్యకుమార్ యాదవ్‌ను తప్పించి.. సెలక్టర్లు అయ్యర్‌కు పగ్గాలు అప్పగించారు. అయితే టీమిండియా టీ20 జట్టు కెప్టెన్‌గా నియమితుడయ్యాక శ్రేయస్ అయ్యర్ తొలిసారి స్పందించాడు. ప్రస్తుతం ముంబై టీ20 లీగ్‌లో శ్రేయర్ అయ్యర్ ఆడుతున్నాడు. అయితే ఓ మ్యాచ్ తర్వాత అతడు మాట్లాడాడు. "నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన బీసీసీఐకు హృదయపూర్వక కృతజ్ఞతలు. దేశానికి నాయకత్వం వహించే అవకాశం రావడం గర్వకారణం. ఇది నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నా. భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం ఎప్పుడూ ప్రత్యేకమే. ఇప్పుడు జట్టుకు నాయకత్వం వహించే అవకాశం రావడం మరింత ఆనందంగా ఉంది. ఇన్నేళ్లుగా అభిమానులు నాపై చూపిస్తున్న ప్రేమ, మద్దతు అమోఘం. వారికి నేనెప్పుడూ రుణపడి ఉంటాను' అని అయ్యర్ తెలిపాడు. కాగా శ్రేయస్ అయ్యర్ సారథిగా ఐపీఎల్‌లో సత్తాచాటాడు. ముఖ్యంగా గత మూడు సీజన్‌లలో అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఐపీఎల్ 2024లో కేకేఆర్‌ను విజయతీరాలకు చేర్చాడు. ఆ తర్వాతి ఏడాది కేకేఆర్‌ను వీడి.. ఐపీఎల్ వేలంలోకి వచ్చాడు. అప్పుడు పంజాబ్ కింగ్స్ జట్టు అతడిని దక్కించుకుని సారథిని చేసింది. ఆటగాళ్ల నుంచి అద్భుత ప్రదర్శన రాబట్టిన కెప్టెన్ అయ్యర్.. తన జట్టును ఫైనల్ వరకూ చేర్చాడు. ఈ సీజన్‌లోనూ తొలి అర్ధభాగంలో ఏడు మ్యాచ్‌లలో ఆరింట్లో గెలిచిన పంజాబ్ కింగ్స్.. ఈజీగా ప్లే ఆఫ్స్ చేరేలా కనిపించింది. కానీ ఆ తర్వాత అనూహ్యంగా తడబడి లీగ్ స్టేజ్ నుంచే నిష్క్రమించింది.

పంజాబ్ కింగ్స్ జట్టు ప్లే ఆఫ్స్ చేరకపోయినా అయ్యర్ మాత్రం ఆటగాడిగా, కెప్టెన్‌గా అదరగొట్టాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తూ ధాటిగా పరుగులు రాబట్టాడు. ఆటగాళ్లలో స్ఫూర్తిని నింపుతూ.. వారు మెరుగైన ప్రదర్శన చేసేందుకు కారమయ్యాడు. ఈ నేపథ్యంలో బీసీసీఐ.. అతడికి టీమిండియా టీ20 జట్టు సారథ్య పగ్గాలు అప్పగించింది.

# టీమిండియాకు సూర్యకుమార్ యాదవ్ గుడ్‌బై?

టీమిండియా స్టార్ క్రికెటర్, మాజీ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడంటూ సోషల్ మీడియాలో ఓ వార్త దావానలంలా వ్యాపించింది. ఇంగ్లాండ్, ఐర్లాండ్ పర్యటనలకు ప్రకటించిన భారత టీ20 జట్టు నుంచి సూర్యకుమార్ యాదవ్‌ను తప్పించడమే కాకుండా



ఆయన స్థానంలో శ్రేయస్ అయ్యర్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. జట్టులో చోటు కోల్పోవడంతో తీవ్ర నిరాశకు గురై సూర్య అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారనే వార్త నెటిజన్లను, క్రీడా ప్రేమికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.ఎక్స్ వేదికగా సూర్యకుమార్ యాదవ్ పేరుతో ఓ పోస్ట్ విపరీతంగా షేర్ అయింది. ఆ పోస్ట్‌లో.. "ఇండియాకు ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలో లభించిన అతిపెద్ద గౌరవం. నా అరంగేట్రం మ్యాచ్‌లో సిక్సర్ బాదడం నుంచి టీ20 ప్రపంచకప్ ట్రోఫీని ముద్దాడటం వరకు సాగిన ఈ ప్రయాణం ఎప్పటికీ మరచిపోలేనిది. నేను అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాలని నిర్ణయించుకున్నాను. బీసీసీఐ, నా తోటి ఆటగాళ్లు, అభిమానులకు ధన్యవాదాలు. ఇకపై సరికొత్త అధ్యాయం వైపు అడుగులు వేస్తాను!" అని రాసి ఉంది. ఈ పోస్ట్ షేర్ చేసిన కేవలం రెండు గంటల్లోనే దాదాపు 3.50 లక్షల మందికి పైగా వీక్షించడంతో వైరల్‌గా మారింది. అయితే ఈ రిటైర్మెంట్ వార్తలపై నిజానిజాలను పరిశీలిస్తే ఇదంతా కేవలం ఒక ఫేక్ వార్త అని తేలింది. సూర్యకుమార్ యాదవ్ అధికారికంగా ఎలాంటి రిటైర్మెంట్ ప్రకటించలేదు. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఆ పోస్ట్ సూర్యకుమార్ అసలు ఖాతా నుంచి వచ్చింది కాదు. అది ఒరిజినల్ అకౌంట్ కాదని నకిలీదని తేలింది. ఆ ఖాతా ప్రొఫైల్ పేరు సూర్యకుమార్ యాదవ్ లాగే ఉన్నప్పటికీ.. దాని హ్యాండిల్ పేరు మాత్రం 'ఏబఅతీవ-ఖశ్రీబింఎఎ' అని ఉంది. ఒక నకిలీ ఖాతా ద్వారా సృష్టించబడిన ఈ రిటైర్మెంట్ పోస్ట్‌ను నిజమని నమ్మి అభిమానులు ఆందోళనకు గురయ్యారు. మరోవైపు ఫామ్ కోల్పోవడం వల్ల ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో సూర్యకుమార్ యాదవ్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. ఈ నేపథ్యంలోనే సెలెక్టర్లు అతడిని పక్కనపెట్టి శ్రేయస్ అయ్యర్‌కు కెప్టెన్సీ ఇచ్చారు. జట్టు నుంచి తనను తొలగించడం, కెప్టెన్సీ మార్పుపై సూర్యకుమార్ యాదవ్ ముంబై టీ20 లీగ్ టాస్ సమయంలో చాలా పరిణతితో మాట్లాడాడు. తన స్థానంలో శ్రేయస్ అయ్యర్ కెప్టెన్ కావడంపై సంతోషం వ్యక్తం చేస్తూ.. "శ్రేయస్ అయ్యర్ కోసం నేను చాలా సంతోషిస్తున్నాను. మేము ముంబై, భారత్ తరఫున కలిసి చాలా క్రికెట్ ఆడాము. అన్నింటికంటే ముఖ్యంగా ముంబై నుంచి భారత్‌కు వరుసగా ముగ్గురు టీ20 కెప్టెన్లు రావడం ముంబై క్రికెట్‌కు గర్వకారణం" అని వ్యాఖ్యానించారు. దీనిని బట్టి సూర్య రిటైర్మెంట్ వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టమవుతోంది.

# చరిత్ర సృష్టించిన శుభ్‌మన్ గిల్..

భారత టెస్టు జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. శనివారం మొహాలీ లోని మహారాజా యాదవీంద్ర సింగ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో అఫ్గానిస్తాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో గిల్ అద్భుత శతకంతో కదం తొక్కాడు. ఈ క్రమంలోనే కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన ఏడాది కాలంలోనే 1000 టెస్టు పరుగులు పూర్తి చేసిన తొలి భారతీయ పురుషుల కెప్టెన్‌గా



గిల్ సరికొత్త రికార్డు నెలకొల్పాడు. శనివారం ఆట ముగిసే సమయానికి 103 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన గిల్, ఆదివారం నాటి ఆటలో 126 పరుగులు (177 బంతుల్లో) చేసి అవుట్ అయ్యాడు.దీంతో కెప్టెన్‌గా తన మొదటి ఇన్నింగ్స్ గణాంకాలను 82.8 సగటుతో 1076 పరుగులతో ముగించాడు. టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే కనీసం 1000 పరుగులు చేసిన కెప్టెన్లలో.. క్రికెట్ దిగ్గజం సర్ డాన్ బ్రాడ్‌మన్ తర్వాత అత్యుత్తమ బ్యాటింగ్ సగటు కలిగిన రెండవ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ నిలిచాడు. ఈ జాబితాలో గిల్ తర్వాత కుమార్ సంగక్కర (69.6 సగటుతో 1601 పరుగులు), స్టీవ్ స్మిత్ (68.1 సగటుతో 4425 పరుగులు), మహేల జయవర్ధనే (59.1 సగటుతో 3665 పరుగులు) ఉన్నారు.2025లో ఇంగ్లాండ్ పర్యటనకు ముందు భారత జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత గిల్‌కు ఇది ఆరో టెస్ట్ సెంచరీ. కెప్టెన్‌గా తాను చేసిన హాఫ్ సెంచరీలలో కేవలం ఒక్కదానిని మినహాయించి, మిగిలిన అన్నింటినీ సెంచరీలుగా మలచి గిల్ కెప్టెన్‌గా రోజురోజుకూ ఎంతో పటిష్టంగా మారుతున్నాడు.మరోవైపు వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ (81 పరుగులు) బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడటంతో అఫ్గానిస్తాన్‌పై భారత్ తన పట్టును మరింత బిగించింది. రెండో రోజు లంచ్ విరామ సమయానికి భారత్ 6 వికెట్ల నష్టానికి 475 పరుగులు చేసింది. ఉదయం ఆట ప్రారంభించిన భారత్‌కు ఆదిలోనే గిల్ వికెట్ రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. అఫ్గాన్ బౌలర్ మహ్మద్ సలీమ్ వేసిన బంతికి గిల్ (126) అవుట్ కావడంతో, వీరి మధ్య నమోదైన 169 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రిషబ్ పంత్ ఇన్నింగ్స్ బాధ్యతను భుజాన వేసుకున్నాడు. అటాకింగ్, డిఫెన్స్‌లను సమపాళ్లలో ప్రదర్శిస్తూ 121 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 81 పరుగులు చేసి రన్ రేట్ తగ్గకుండా చూశాడు.మరో యువ ఆటగాడు ధ్రువ్ జురెల్ కొన్ని ఆకర్షణీయమైన షాట్లు ఆడినప్పటికీ, సలీమ్ వేసిన రివర్స్ స్వింగ్ బంతిని అంచనా వేయడంలో విఫలమై క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఇక పంత్ సెంచరీ వైపు దూసుకుపోతున్న తరుణంలో, అఫ్గాన్ అరంగేట్రం లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ నంగ్యాలియా ఖరోటే వేసిన స్లో డెలివరీని సరిగ్గా కనెక్ట్ చేయలేక పంత్ ఈజీ క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. అఫ్గాన్ బౌలర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ రెండో కొత్త బంతితో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి భారత బ్యాటర్లను ఇబ్బంది పెట్టినప్పటికీ అతనికి వికెట్లు దక్కలేదు. చివరకు భారత్ తన తొలి ఇన్నింగ్స్‌ను 8 వికెట్లకు 564 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది.



## జూన్ 12న థియేటర్లలోకి 'పోలీస్ కంప్లైంట్'

### చిత్ర యూనిట్‌ను అభినందించిన ఘట్టమనేని ఆదిశేషగిరిరావు

హారర్, యాక్షన్, థ్రిల్లర్ అంశాల సమ్మేళనంగా రూపొందిన అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'పోలీస్ కంప్లైంట్' జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మించిన ఈ చిత్రానికి క్రియేటివ్ డైరెక్టర్ సంజీవ్ మేగోటి దర్శకత్వం వహించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, ప్రచార గీతాలు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించగా, తాజాగా చిత్రంలో సూపర్‌స్టార్ కృష్ణకు నివాళిగా రూపొందించిన ప్రత్యేక గీతం మరింత ఆకర్షణగా నిలిచింది. ఈ పాటను వీక్షించిన సూపర్‌స్టార్ కృష్ణ సోదరుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు చిత్ర యూనిట్‌ను ప్రత్యేకంగా అభినందిం చారు. పాట అద్భుతంగా వచ్చిందని ప్రశంసిస్తూ, సినిమా ఘన విజయం సాధించాలని తన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణసాయి, కృతి వర్మలపై చిత్రీకరించిన ప్రత్యేక గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. సూపర్‌స్టార్ కృష్ణపై రూపొందించిన ఈ గీతం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ, "సూపర్‌స్టార్ కృష్ణ గారి సోదరుడు ఘట్టమనేని ఆదిశేషగి రిరావు గారు మా చిత్రాన్ని, ముఖ్యంగా కృష్ణ గారిపై రూపొందించిన ప్రత్యేక గీతాన్ని మెచ్చుకోవడం మా యూనిట్‌కు ఎంతో గర్వకారణం. ఆయన ఆశీర్వాదాలు మాకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయి. ఈ చిత్రాన్ని 52 మంది సీనియర్ ఆర్టిస్టులతో కేవలం 45 రోజుల్లో పూర్తి చేశాం. 'చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే వైవిధ్యమైన కాన్సెప్ట్ చుట్టూ కథ సాగుతుంది. హారర్ థ్రిల్లర్ అంశాలతో పాటు యాక్షన్, ఎమోషన్స్ కలగలిసిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది" అన్నారు. హీరో కృష్ణసాయి మాట్లాడుతూ, "మా అభిమాన హీరో సూపర్‌స్టార్ కృష్ణ గారిపై రూపొందించిన పాటలో నటించే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఆ పాటను కృష్ణ గారి సోదరుడు ఆదిశేషగిరిరావు గారు చూసి ప్రశంసించడం మాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. దర్శకుడు సంజీవ్ మేగోటి సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. ఇండస్ట్రీలో ఈ చిత్రం పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే అంశాలు ఇందులో ఉన్నాయి. అందరూ థియేటర్లలో సినిమా చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను" అన్నారు. నవీన్ చంద్ర, వరలక్ష్మి శరత్‌కుమార్, కృష్ణసాయి, రాగిణి ద్వివేది ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంపై ఆదిశేషగిరిరావు ఆశీర్వాదాలతో అంచనాలు మరింత పెరిగాయి. హారర్, యాక్షన్, కామెడీ, రొమాన్స్, థ్రిల్లర్ అంశాల సమ్మేళనంగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు వినూత్నమైన సినీ అనుభూతిని అందించనుందని చిత్రబృందం విశ్వాసం వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌తో పాటు ప్రత్యేక గీతాలు కూడా మంచి స్పందనను సొంతం చేసుకోవడంతో 'పోలీస్ కంప్లైంట్'పై సినీ ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

## రామాయణ, వారణాసి బడ్జెట్ లెక్కలు


### హైప్ క్రియేట్ చేస్తున్నారని కొట్టి పారేసిన మనోజ్

రామాయణ' పై 4000 కోట్ల బడ్జెట్ పెట్టారు. పాన్ ఇంటర్నేషనల్ మూవీ 'వారణాసి', 1300 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతోంది. రామాయణ, వారణాసి బడ్జెట్ షాక్ ఇస్తోంది. అయితే ఇందులో ఎంతమాత్రం నిజం లేదని ఇదంతా కేవలం హైప్ క్రియేట్ చేయడానికే అని బాలీవుడ్ యాక్టర్ మనోజ్ బాజ్‌పాయ్ తేల్చి పారేసాడు.

రాజమౌళి అంటేనే బ్జడెట్. తెలుగు తెరకే కాదు, ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌కు భారీ బ్జడెట్, భారీ వసూళ్లు ఎలా ఉంటాయో చూపించాడు రాజమౌళి. తెలుగు సినిమా బ్జడెట్ 20 కోట్ల లోపే ఉన్న సమయంలో, 'మగధీర' పై 40 కోట్లు పెట్టించాడు. బాక్స్ ఆఫీస్ దగ్గర 50 కోట్ల మార్కు దాటిన తొలి చిత్రంగా 'మగధీర' నిలిచింది. ఇక 'బాహుబలి 2' తో రాజమౌళి సెట్ చేసిన రికార్డులు ఇప్పటికీ కొన్ని చోట్ల పదిలంగానే ఉన్నాయి. మరి ఇంత ట్రాక్ రికార్డు ఉన్న రాజమౌళి, 'వారణాసి'




తో పాన్ ఇంటర్నేషనల్‌కు పరిచయం అవుతున్నాడు. దీనికి తగ్గట్టే బ్జడెట్ పెంచేసాడు. 'వారణాసి' 800 కోట్ల బ్జడెట్‌తో మొదలైంది. సెట్స్ పైకి వెళ్ళాక 1000 కోట్లు అన్నారు. ఏడాది పాటు షూటింగ్ పూర్తి చేశాక, 1300 కోట్లకు వెళ్ళిందన్నారు. సినిమా పూర్తి అయ్యేసరికి 1500 కోట్లకు చేరినా ఆశ్చర్యం లేదు. బాలీవుడ్ యాక్టర్ మనోజ్ బాజ్‌పాయ్, రామాయణ, వారణాసి బ్జడెట్‌పై చేసిన షాకింగ్ కామెంట్స్ వైరల్ అయ్యాయి. ఈ సినిమాల బ్జడెట్ లెక్కలన్నీ కేవలం పిఆర్ టీం స్టంట్ అని ఆయన అభిప్రాయపడ్డాడు. 15 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఇదే తంతు నడుస్తోందని, హైప్ కోసం చెప్పే నంబర్స్ అంటూ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. 4 వేల కోట్ల బ్జడెట్‌తో హిందీ 'రామాయణ' తెరకెక్కుతోంది. ఒక్కో పార్ట్‌కు 2000 కోట్లు ఖర్చు పెడుతున్నారు. దాదాపు సగం పైగా బ్జడెట్ విఎఫ్ఎక్స్ కే ఖర్చు పెడుతున్నారట. ఎన్ని కోట్లు పెట్టినా 4000 కోట్ల బడ్జెట్ అనేది నమ్మేలా లేదంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మనోజ్ బాజ్‌పాయ్ చెప్పిన పిఆర్ టీం బ్జడెట్ లెక్కల్లో ఎంత నిజం ఉందో లేదో గానీ, ఈ కామెంట్స్ పెద్ద చర్చకు దారితీశాయి. మనోజ్ నటిస్తున్న 'గవర్నర్' మూవీ 12న రిలీజ్ అవుతోంది. సినిమా వస్తోందన్న సంగతి చాలామందికి తెలియడం లేదు, అందుకే తన సినిమాకు హైప్ తీసుకొచ్చేందుకే ఇలా మాట్లాడాడంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు.



## హైదరాబాద్ నుంచి వారణాసి వరకు 'నాగబంధం' అద్భుత ప్రచార యాత్ర- నైజాంలో ప్రముఖ నిర్మాత దిల్ రాజు ద్వారా గ్రాండ్‌గా రిలీజ్

అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం – ది సీక్రెట్ ట్రెజర్' చిత్రాన్ని దేశవ్యాప్తంగా సంచలనంగా నిలిపేందుకు చిత్రబృందం విస్తృత స్థాయిలో ప్రమోషన్స్ నిర్వహిస్తోంది. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రంలో విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్నారు. జూలై 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా కోసం మేకర్స్ దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రమోషనల్ టూర్‌ను ప్రకటించారు. సాధారణ ప్రమోషన్స్‌కు భిన్నంగా, సినిమా కథలోని ట్రెజర్ హంట్ కాన్సెప్ట్‌కు అనుగుణంగా ఈ ప్రచార యాత్రను రూపొందించారు. ప్రతి నగరంలో జరిగే కార్యక్రమం ద్వారా సినిమా ప్రపంచం, అందులోని రహస్యాలు, సాహస అంశాలను ప్రేక్షకులకు మరింత దగ్గర చేయనున్నారు. ఈ టూర్‌లో తొలి కార్యక్రమం జూన్ 19న హైదరాబాద్‌లో ట్రైలర్ లాంచ్. సినిమా స్థాయి, విజువల్స్, కథపై మరింత ఆసక్తిని పెంచేలా ఈ ఈవెంట్ ఉండనుంది. అనంతరం జూన్ 20 నుంచి 23 వరకు ముంబై, చెన్నై, బెంగళూరు, కొచ్చి నగరాల్లో వరుసగా ప్రమోషనల్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఈవెంట్స్ ద్వారా దేశవ్యాప్తంగా సినిమా రీచ్‌ను మరింత విస్తరించాలనే లక్ష్యంతో చిత్రబృందం ముందుకు సాగుతోంది. ఈ ప్రమోషనల్ టూర్‌లో ప్రత్యేక ఆకర్షణగా జూన్ 26న వారణాసిలో 'వీర నాగ' పాట విడుదల కానుంది. వారణాసి నగరానికి ఉన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యత సినిమా టైటిల్, కథలోని నేపథ్యానికి అద్భుతంగా వుంటుంది. అలాగే జూన్ 28న హైదరాబాద్‌లో గ్రాండ్ ప్రీ-రిలీజ్ ఈవెంట్ నిర్వహించను న్నారు. విడుదలకు ముందు రోజు జూలై 2న ప్రత్యేక ప్రీమియర్ షో ఏర్పాటు చేసి, చిత్రబృందం ఈ ప్రమోషనల్ జర్నీని ఘనంగా సెలబ్రేట్ చేయనుంది. 'నాగబంధం – ది సీక్రెట్ ట్రెజర్' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొల్పింది. ఈ భారీ ప్రమోషనల్ టూర్‌తో ఆ ఆసక్తి మరింత పెరగనుంది. నాగబంధం' నైజాం థియేట్రికల్ హక్కులను ఫ్యాన్సీ రేటుకు సొంతం చేసుకున్న ప్రముఖ నిర్మాత దిల్ రాజు, చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## ప్రముఖ దర్శకులు ఎ. కోదండరామి రెడ్డి చేతుల మీదుగా 'కొత్త మలుపు' ట్రైలర్ లాంచ్

ప్రముఖ నేపథ్య గాయని సునీత తనయుడు ఆకాష్ గోపరాజు హీరోగా భైరవి అర్ధ్యా హీరోయిన్ గా నటించిన శివ వరప్రసాద్ కేశనకుర్తి దర్శకత్వంలో తాటి బాలకృష్ణ నిర్మించిన 'కొత్త మలుపు' మూవీ జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ చిత్రాన్ని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల చేయనుంది. ఈ సందర్భంగా ప్రముఖ దర్శకుడు ఎ. కోదండరామి రెడ్డి చిత్ర ట్రైలర్‌ను విడుదల చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్ లాంచ్ సందర్భంగా ఎ. కోదండరామి రెడ్డి మాట్లాడుతూ, "ట్రైలర్ చాలా బాగుంది. సినిమా కాన్సెప్ట్ కూడా నచ్చింది. హీరో, హీరోయిన్ ఇద్దరూ ఆకట్టుకున్నారు. ప్రేక్షకులు ఈ చిత్రాన్ని పెద్ద విజయంగా నిలబెట్టాలని కోరుకుంటు న్నాను" అన్నారు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఈ రొమాంటిక్ ప్రేమకథలో ప్రేమ, సస్పెన్స్, వినోదం సమపాళ్లలో ఉంటాయని చిత్ర యూనిట్ తెలిపింది. ఇందులో ఆకాష్, భైరవి బావ–మరదళ్ల పాత్రల్లో కనిపించనున్నారు. రఘుబాబు, పృథ్వీరాజ్, ప్రభావతి తదితరులు కీలక పాత్రలు పోషించారు. సంగీతాన్ని యశ్వంత్ నాగ్ అందించారు. దర్శకుడు శివ వరప్రసాద్ కేశనకుర్తి మాట్లాడుతూ, " మా సినిమా ట్రైలర్ లాంచ్ చేసి ఆశీర్వదించిన దర్శక దిగ్గజం కోదండరామి రెడ్డి గారికి హృదయ పూర్వక ధన్యవాదములు. రొమాంటిక్ లవ్ సస్పెన్స్ జానర్‌లో ఈ సినిమాను రూపొందించాం. ఆకాష్–భైరవి జోడీ చాలా బాగా కుదిరింది. కోనసీమ అందాలను తెరపై ఆవిష్కరిస్తూ, మంచి కామెడీతో కూడిన కథను ప్రేక్షకులకు అందిస్తున్నాం. జూన్ 12న సినిమా విడుదల కానుంది" అని తెలిపారు. నిర్మాత తాటి బాలకృష్ణ మాట్లాడుతూ, "మా సినిమా బాగుందని బ్లెస్సింగ్ అందించిన ప్రముఖ దర్శకులు ఏ కోదండరా మిరెడ్డి గారికి కృతజ్ఞతలు. ఇది నాకు తొలి సినిమా. దర్శకుడికి తొలి చిత్రం. హీరోయిన్‌కు తొలి సినిమా. హీరో ఆకాష్‌కు రెండో సినిమా. పూర్తిగా గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని చెప్పారు. కమెడియన్ మహేంద్ర సినిమా లో చేసిన కామెడీ హైలెట్ గా నిలుస్తుందని అన్నారు.. హీరో ఆకాష్ గోపరాజు మాట్లాడుతూ, " ముందుగా మా సినిమాను మా చిత్ర యూనిట్ ను అభినందించిన కోదండరామిరెడ్డి



గారికి ధన్యవాదాలు. ఈ చిత్రానికి మంచి కథ అందించిన దర్శకుడికి కృతజ్ఞతలు. మైత్రి మూవీస్ వంటి సంస్థ మద్దతు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది. మా అమ్మ సునీతతో పాటు చిత్ర యూనిట్ అందరికీ ధన్యవాదాలు" అన్నారు. హీరోయిన్ భైరవి అర్ధ్యా మాట్లాడుతూ, "నా కెరీర్‌లో 'కొత్త మలుపు' చాలా ప్రత్యేకమైన చిత్రం. ప్రేమ, సస్పెన్స్, హాస్యం కలగలిపిన ఈ కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది. ఆకాష్‌తో నా జోడీ, బావ–మరదళ్ల పాత్రలు ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తాయి" అని పేర్కొన్నారు. చిత్ర యూనిట్ సభ్యుల ప్రకారం, 'కొత్త మలుపు' కేవలం ప్రేమకథ మాత్రమే కాకుండా భావోద్వేగాలు, ఉత్కంఠ, హాస్యం, కుటుంబ ప్రేక్షకులను అలరించే అంశాలతో కూడిన పూర్తి వినోదాత్మక చిత్రంగా రూపొందింది. జూన్ 12న విడుదల కానున్న 'కొత్త మలుపు' ప్రేక్షకులకు ప్రేమ, సస్పెన్స్, హాస్యం, కుటుంబ భావోద్వేగాలతో కూడిన వినోదాన్ని అందించేందుకు సిద్ధమవుతోంది.

## మాస్ మహారాజా రవితేజ, శివ నిర్వాణ, మైత్రీ మూవీ మేకర్స్ 'ఇరుముడి' ఆగస్టు 21న వరల్డ్ వైడ్ రిలీజ్

మాస్ మహారాజా రవితేజ, ప్రముఖ పాన్–ఇండియా నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' నిర్మిస్తున్న 'ఇరుముడి' చిత్రం కోసం దర్శకుడు శివ నిర్వాణ జతకట్టారు. ఈ చిత్రానికి సంబంధించిన 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్ కు వచ్చిన అద్భుతమైన స్పందనతో సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండబోతోంది. ఓ అంకితభావం గల తండ్రి పాత్రలో రవితేజ నటన ప్రేక్షకుల హృదయాలను తాకేలా ఉంటుంది, గ్లింప్స్‌కు వచ్చిన విశేష స్పందనతో ఉత్సాహంతో ఉన్న చిత్రబృందం తాజాగా సినిమా విడుదల తేదీని ప్రకటించింది. వరలక్ష్మీ వ్రతం శుభ సందర్భంగా ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు అనౌన్స్ చేశారు. విడుదలకు ఇంకా రెండు నెలల సమయం ఉండటంతో రాబోయే రోజుల్లో వరుస ప్రమోషనల్ అప్‌డేట్స్ ఇవ్వనున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది. ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. రవితేజ, శివ నిర్వాణ పూర్తి అంకితభావంతో పని చేస్తూ సినిమాను అద్భుతంగా తీర్చిది ద్దుతున్నారు. ఎనర్జిటిక్ కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ 'ఇరుముడి'లో పూర్తిగా భిన్నమైన, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న పాత్రలో కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తిగా ఆయన నటన ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని కలిగించ నుంది. మానవ సంబంధాలు, కుటుంబ విలువల నేపథ్యంలో శివ నిర్వాణ ఈ కథను మనసుని ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. అదే సమయంలో కమర్షియల్ అంశాలను కూడా సమతూకంగా మేళవించారు. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియ భవాని శంకర్



హీరోయిన్‌గా నటిస్తుండగా, బేబీ నక్షత్ర కీలక పాత్ర పోషిస్తోంది. సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైన్, ప్రవీణ్ పూడి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శివ నిర్వాణ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించగా, నరేష్ బాబు పి స్క్రిప్ట్ కోఆర్డినేటర్‌గా వ్యవహ రిస్తున్నారు. యాక్షన్, భక్తి, కుటుంబ బంధాలు, భావోద్వేగాలను సమన్వయం చేస్తూ రూపొందుతున్న 'ఇరుముడి', రవితేజ కెరీర్‌లో అత్యంత ప్రత్యేకమైన చిత్రాల్లో ఒకటిగా నిలవబోతోంది.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 68-5-1/1,Near Municipal Complex , Patamata,N.T.R , Andhra Pradesh-520010 .Editor : Sudheer kumar katepally ph: 9000657700, PRGI NO: APTEL/26/A2264